కార్మిక లోకం

సి. ఐ. టి. యు. ఆంధ్రప్రదేశ్ కమిటీ మాసపత్రిక

సంపుటి : 8 ♦ జూన్ 1982 ♦ వెల : 75 పైసలు ♦ సంచిక 6

ప్రపంచ కార్మిక, కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు

కామ్రేడ్ డిమిట్రోవ్ శతజయంతి

కామ్రేడ్ జార్జి డిమిట్రోవ్ శతజయంతి అయిన 1982 జూన్ 18 సందర్భంగా ఆ విప్లవోత్తమునికి విప్లవాంజలి ఘటిసున్నాం. కామ్రేడ్ డిమిట్రోవ్ బల్గేరియాలో జన్మించారు. ప్రింటింగ్ ప్రెస్ కార్మికుడుగా తన 15 వ ఏటనే కామ్రేడ్ డిమిట్రోవ్ బల్గేరియన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీలో 1902 లో చేరాడు. ఆ మరు సంవత్సరంలోనే ఆ పార్టీలో చీలికరాగా కామ్రేడ్ డిమిట్రోవ్ అతివాద సోషలిస్టులైన విప్లవ వర్గాన్ని సమర్థించాడు.

అయితే సంకుచిత అతివాద దుందుడుకు వాదాన్నుండి ఆయన ఎప్పుడూ వేరుగానే వున్నారు. 1909లో కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. 1909-1923 కాలంలో బల్గేరియా విప్లవ కార్మిక సంఘాల కేంద్ర కౌన్సిలు కార్యదర్శిగా పనిచేశారు. సోఫియాలోని బల్గేరియా పార్లమెంటులో 1913నుండి 1923 వరకు పార్టీ తరపున జాతీయ ప్రతినిధిగా ఉన్నారు.

సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా సాగించిన విప్లవ కార్యకలాపాలకు మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఆ కామ్రేడ్ నిర్బంధించబడ్డారు. యుద్ధానంతరం 1919-20లో ఆయనవీరోచితంగా రైల్వేసమ్మెనునడి రు.

1923లో బల్గేరియాలో ఫాసిస్టు ముఠా కుట్ర జరిగింది. దీనికి వ్యతిరేకంగా కామ్రేడ్ వాసిల్ కొలోరోవ్‌తోపాటు కామ్రేడ్ డిమిట్రోవ్ తిరుగుబాటు సాగించారు ఫాసిస్టు దమనకాండ సాగింది.

కామ్రేడ్ డిమిట్రోవ్‌ను బల్గేరియా నుండి బహిష్కరించటమే గాక, ఆ కామ్రేడ్‌పైన రెండు ఉరిశిక్షలు ప్రకటించబడ్డాయి. అప్పటి నుండి ఆ కామ్రేడ్ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కార్యవర్గ కమిటీలో పనిచేశారు. ఆ సంస్థ నిర్వహించిన అతి ప్రాముఖ్యమైన కర్తవ్యాల సందర్భంగా 1933 ఫిబ్రవరి బెర్లిన్‌లో నాజీలు కామ్రేడ్ డిమిట్రోవ్‌ను అరెస్టుచేసి రిచ్‌స్టాగ్ దహనకాండ కేసు బనాయించారు.

5 మాసాలు పాశవిక హింసలకు గురయ్యారు 3 మాసాలు విచారణ సాగింది. నేరస్తుడుగా చిత్రించబడ్డ కామ్రేడ్ డిమిట్రోవ్ ఫాసిజం నేరాన్ని దుయ్యబట్టారు. నాజీ హంతకుడు గొయెరింగ్ ఉక్రోషంతో కోర్టుహాలులోనే "బయటకెళ్ళగానే ఉరి తీయబడే వాడివిరా" అని నిందించాడు. ఉరికంబాల ముందు ఆ భయానక పరిస్థితులలో కమ్యూనిస్టుగా వీరోచిత ధైర్యసాహసాలు ప్రదర్శించిన ఉత్తమ విప్లవకారుడు కామ్రేడ్ డిమిట్రోవ్ విచారణ సందర్భంగా కమ్యూనిజం అంతిమ విజయం మీద అచంచల ఆత్మ విశ్వాసం ప్రకటించి ఫాసిజాన్ని ఎండగట్టారు. ఆనాడు ఆ కామ్రేడ్ పలికిన విప్లవ పలుకులలాగా చరిత్ర రథచక్రాలు తిరుగుతున్నాయి. చిత్రహింసలతో, నిర్బంధాలతో, ఉరి శిక్షలతో ఆ రథచక్రాలనాపలేరు. కమ్యూనిజం అంతిమ విజయంతథ్యం' అన్నారు.

చివరకు విచారణలో కామ్రేడ్ డిమిట్రోవ్‌ను దోషిగా తేల్చలేక పోయారు. మరో 2 మాసాలు జైలులోనే వున్నారు. బల్గేరియా పౌరసత్వం నుండి బహిష్కరించబడినందుకు సోవియట్ యూనియన్ పౌరసత్వంయిచ్చింది. విడుదలై ఆ కామ్రేడ్ మాస్కో వెళ్ళి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ పనిలో వున్నారు.

1935 లో కమ్యూనిస్టు ఇంటర్నేషల్ 7 వ కాంగ్రెస్‌లో కామ్రేడ్ డిమిట్రోవ్ ప్రధాన నివేదిక ప్రవేశపెట్టారు. మార్క్సిస్టు-లెనినిస్టు అవగాహనతో ఫాసిజాన్ని యుద్ధ ప్రమాదాన్ని విశ్లేషించారు. అవి అభివృద్ధి నిరోధక ఆయుధమైన ఫాసిజం, దురహంకార పూరితమైన, జాతీయ దురహంకార పూరితమైన, సామ్రాజ్యవాద పూరితమైన బడా బూర్జువాలోని శక్తులు ఫాసిస్టు నియంతృత్వ రూపంలో పెట్టుబడిదారీ విధాన సంక్షోభంలో అంతర్గత, బహిరంగ వైరుధ్యాల ఫలితమే. ఫాసిజం పరమ కిరాతక రాక్షస రూపం అన్నాడు విప్లవోద్యమే దానిని అంతం చేయగలదన్నారు ఫాసిజానికి వ్యతిరేకంగా, యుద్ధప్రమాదానికి వ్యతిరేకంగా మార్క్సిస్టు అవగాహనతో వ్యూహం ఎత్తుగడలు, కార్మికవర్గ ఐక్యకార్యాచరణ, జాతీయంగాను, అంతర్జాతీయం గాను, విశాల ఫాసిస్టు వ్యతిరేక ఐక్య సంఘటన, కార్మికవర్గ ఐక్య సంఘటన వాటి స్వరూప స్వభావాలు విశ్లేషించుతూకమ్యూనిస్టులు పిడివాదానికీ,దుందుడుకు వాదానికి, మితవాద ప్రమాదాలకు గురిగాకుండా విప్లవ కర్తవ్యాలు నిర్వహించాల్సిన తీరు నివేదించారు. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ 7వ కాంగ్రెసులో కార్యనిర్వాహక

(మిగతా 11వ పేజీలో)

" ప్రపంచ కార్మికులారా ఏకంకండు "

అంతర్జాతీయ ద్రవ్యనిధి - గయానా

ఈ వ్యాసాన్ని పీపుల్స్ ప్రోగ్రసివ్ పార్టీ ఆఫ్ గయానా నాయకుడు, మాజీముఖ్యమంత్రి చెడిజగన్ వ్రాసారు. ఇందులో గయానా అం. ద్ర. ని (ఐ యం.ఎఫ్.)నించి అప్పు తెచ్చుకోవడం ప్రారంభించింతర్వాత ఆ దేశ ప్రజలపై ముఖ్యంగా కార్మిక వర్గంపై ఎంత బరువు మోపబడుతుందో తెలిపారు. అయితే మన దేశాన్ని విచ్చలవిడిగా పాలిస్తున్న కాంగ్రెస్(ఐ) ప్రభుత్వం కూడా అదే అం.ద్ర ని ని యాచించి అప్పు తెచ్చుకొంది. మరి మనదేశ కార్మికవర్గంపై ఎట్లాంటి బరువులు మోపబడతాయో యిప్పటికే తెలిసిపోయింది అయినా యింకా కొన్ని ప్రత్యక్ష ఉదాహరణలు, పరీక్షించాల్సిన అవసరం మన కార్మిక లోకానికి వుంది. అందుచేత ఆ వ్యాసంలోని కొన్ని ముఖ్యమైన అంశాలను యిక్కడ ప్రచురిస్తున్నాం.

—సం॥

అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి అప్పు తెచ్చుకోవటానికై ఆ సంస్థను సంతృప్తిపరచటానికి గయానా ప్రభుత్వం కార్మిక వర్గం మీద మోపే బరువులకు అంతులేనట్లు కనిపిస్తూంది ఇది టి.యు.సి. ప్రధాన కార్యదర్శి జోసెఫ్ పోలిడోర్ 1978 సమావేశంలో అన్నమాటలు. గయానాలో బర్న్హామ్ అధికారంలోకి వచ్చి అం. ద్ర. ని అప్పుకోసం పరుగులెత్తిన దగ్గరనుంచి వున్న పరిస్థితి అది.

అంతర్జాతీయ ద్రవ్యనిధి సామ్రాజ్యవాదం అదుపు ఆజ్ఞల్లో వున్న సంస్థ. ఇది ప్రపంచ రాజకీయాల్లో అతి కీలకమైన పాత్ర నిర్వహిస్తూంది. ఇది పెట్టుబడిదారీ వర్గం చేతుల్లో ఒక ఆయుధంగా ఉపయోగపడుతున్నది.

'వరల్డ్ మార్క్సిస్ట్ రెవ్యూ' అనేపత్రిక తన జూలై 1981 సంచికలో ఇట్లా రాసింది.

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ దీర్ఘ కాలిక సంక్షోభంలో పడింది

పెట్టుబడిదారీ వ్యవస్థలోని దేశాల మధ్య లావాదేవీల తారతమ్యాలు ఎక్కువగా వుంటున్నాయి. వాటి కరెన్సీలు సంక్షోభాల్లో పడ్డాయి. ముఖ్యంగా అమెరికా డాలరు. వివిధ దేశాల కరెన్సీల మార్పిడిరేట్లు విపరీతంగా మార్పులు చెందుతున్నాయి ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోతోంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా వుంది వాటి అప్పులు పెరిగిపోతున్నాయి. ప్రధాన సామ్రాజ్యవాద కేంద్రాల మధ్య, పెట్టుబడిదారీ దేశాలమధ్య అభివృద్ధి చెందుతున్న దేశాలమధ్య ఆర్థిక వైరుధ్యాలు రోజురోజుకు తీవ్రతరమవుతున్నాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాలలోని ఆర్థిక సంక్షోభానికి ప్రధానకారణాలు— పెట్టుబడిదారీ దేశాలలో ఎగుమతులకు పట్టుకున్న జాడ్యం, (ద్రవ్యోల్బణం, ఎక్కువ వడ్డీరేట్లు, రక్షించుకోవటం (ప్రొటెక్షనిజం)) రెండవది సామ్రాజ్యవాద అనుకూల, పెట్టుబడిదారీ అనుకూల ఆర్థిక పంథా. పెట్టుబడిదారీ దేశాలతో వ్యాపారసంబంధాలు, అర్థంలేని ఖర్చులు బ్యూరోక్రసి, మిలిటరీ వ్యయం, లంచగొండితనం.

ఇటువంటి పరిస్థితులలో ఐ. యమ్. ఎఫ్. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అనేక ఆంక్షలు పెట్టి అప్పులివ్వటం అనేది జరుగుతూంది.

ప్రభుత్వాన్ని ఆజ్ఞాపించటం

ఈ ఆంక్షలన్నీ అంగీకరించిన తరువాత అంతర్జాతీయ ద్రవ్యనిధి ఇచ్చే సర్టిఫికేటును బట్టి విదేశీ బ్యాంకులు అప్పులు ఇస్తాయి. ఇదంతా కూడ గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలు అధికం చేసేటందుకే।

ఐక్యరాజ్య సమితిలోని లాటిన్ అమెరికాల ఆర్థిక కమిషన్ కూడ ఈ విషయాన్ని అంగీకరించింది. ఐక్యరాజ్య సమితి నివేదికలో 1964లోనే ఈఆర్థిక వనరులు లాటిన్ అమెరికా దేశాలలోని ప్రైవేటు పెట్టుబడులతో పోటీ పడకుండా చూడటం జరుగుతోంది. ఈ రుణ విధానం పరిశ్రమల అభివృద్ధికి కాకుండా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు మాత్రమే ఉపయోగ పడుతున్నాయి అని నివేదించబడింది.

కఠినమైన విధానాలు

1981లో జరిగినఅంతర్జాతీయద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు సమావేశాలలో అమెరికా ఆర్థిక కార్యదర్శి డొనాల్డ్ రీగన్ ఆ సంస్థలు రుణాలు ఇచ్చేటప్పుడు రుణ గ్రహీతల విషయంలో కఠినమైన విధానాలు అవలంబించాలని సూచించాడు. ప్రతిదేశం కూడ తమ అంతర్గత ఆర్థిక విధానాలను క్రమబద్ధం చేసుకోవాలని అన్నారు.

అంతర్గత ఆర్థిక విధానాలు క్రమబద్ధం చేసుకోవాలి అంటే రీగన్ ఉద్దేశ్యంలో పెట్టుబడిదారీ విధానాన్ని ప్రోత్సహించాలనీ, మార్కెట్లమీద పెట్టుబడిదారులకే అధికారం ఉండాలనీ తప్పితే నిస్సందేహంగా వేరొకటి కాదు గయానాలోని పీపుల్స్ ప్రోగ్రెసివ్ పార్టీ, చిలీలో యూనిదార్ పాపులర్ ప్రభుత్వం,జమైకాలోని పి.ఎన్.పి. ప్రభుత్వం అధికారాల్లో ఉన్నపుడు, వారి దేశ ఆర్థిక విధానాలను చక్కదిద్దుకోవటానికి విప్లవాత్మకమైన ప్రజాతంత్ర విధానాలను అవలంబిస్తూ ఉంటే సి ఐ ఏ ఆ ప్రభుత్వాలను కుట్ర చేసి పడగొట్టింది.

ఆదేపద్ధతిలో ప్రపంచబ్యాంకు అధ్యక్షుడు క్లాసెన్ కూడా అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా జాతీయ పరిస్థితులను కూడా మలచుకోమని సలహా ఇచ్చాడు అంటే రీగన్ ప్రభుత్వం యొక్క విపరీతమైన వడ్డీరేట్లకు అంగీకరించటమే। అంతే కాకుండా రీగన్ ప్రభుత్వం అభివృద్ధి చెందుతున్న దేశాల మీద ఇంకా కఠినమైన ఆంక్షలు విధించాలని కోరుతోంది.

పెట్టుబడిదారీ దేశాలు అతి తక్కువ వడ్డీకి అప్పులిస్తున్నటువంటి అంతర్జాతీయ అభివృద్ధి సంస్థను నాశనం చేశాయి. అంతే కాకుండా ఈనాడు అభివృద్ధి చెందుతున్న దేశాల అవసరాల కనుగుణంగా అంతర్జాతీయ ద్రవ్యనిధి ఆస్తులను పెంచడానికి అంగీకరించడం లేదు. అదే సమయంలో వేరొక ప్రక్క అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రపంచ బ్యాంకులతో ప్రైవేటు బ్యాంకుల కుండే లావాదేవీలను సంబంధాలను బలపరచడానికి కృషి జరుగుతోంది 1981లో ఎన్నడూ లేనంతగా ప్రపంచబ్యాంకు ప్రైవేటు బ్యాంకు సహాయంతో అభివృద్ధి చెందుతున్న దేశాలకు అప్పులివ్వటం జరిగింది. ఇది ఆయా దేశాల్లో ప్రైవేటు రంగానికి అధికంగా ఉపయోగపడుతుంది.

ప్రభుత్వాల మీద వత్తిడులు

ఈ ఆంక్షలు 1979లో టర్కీ ప్రభుత్వం సోషలిస్టు దేశాలతో, అభివృద్ధి చెందుతున్న దేశాలతో చేసుకొన్న ఒప్పందాలు రద్దు కావడానికి దారి తీసింది. ఈ వొత్తిడులు జమైకాలోని మాన్లే ప్రభుత్వం సోషలిస్టు క్యూబాతో చేసుకొన్న ఒప్పందాన్ని రద్దు చేసింది. జైరేలోని మొబుట్టో కీలుబొమ్మ ప్రభుత్వ,

అంగోలా మీద దాడికి దారి తీసింది. ఈ అంశలు పెరూ ప్రభుత్వం తలపెట్టిన సాంఘిక, ఆర్థిక మార్పులని రద్దు చేసుకొనేటట్లు చేసింది.

1981 అంతంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి భారతదేశానికి యివ్వతలపెట్టిన 5 6బి॥ డాలర్ల సమావేశానికి అమెరికా హాజరు కాలేదు. ఇది భారత ప్రభుత్వానికే ఒక హెచ్చరిక అనేదాంట్లో ఎటువంటి సందేహమూ లేదు. వారన్ అన్న ప్రకారం దీని ప్రధానకారణం భారతదేశం సోషలిస్టు రష్యాతో స్నేహపూర్వకంగా వుండటమే. ఈ విధానం వల్ల అమెరికా ప్రెసిడెంటుకానీ, అమెరికా కాంగ్రెస్‌గానీ, అమెరికా ప్రభుత్వంగానీ భారతదేశాన్ని ఎక్కువగా అభిమానించలేకపోతోంది.

ఈ సమావేశానికి హాజరు కాకూడదన్న దానికి ప్రధానకారణాలు ఆహార పదార్థాల మీద యిచ్చేటటువంటి సబ్సిడీలు తగ్గించడానికి, గుత్తవ్యాపార సంస్థలో వ్యతిరేకంగా చట్టాలని రద్దుచెయ్యడానికి, దిగుమతులను సడలించడానికి, దిగుమతి అంశలని రద్దు చెయ్యడానికి, అం. ద్ర. ని వత్తిడి చేసుకురావాలనే ।

ఉచ్చులతో కూడిన సహాయం

రాజకీయ ఉచ్చులతో కూడినటువంటి సహాయానికి గయానా ఒకప్రత్యక్షనిదర్శనం 1953లో మొట్టమొదటి పీపుల్స్ ప్రోగ్రెసివ్ పార్టీ ప్రభుత్వాన్ని తొలగించిన తరువాత, బ్రిటన్ అక్కడవున్న కీలుబొమ్మ ప్రభుత్వానికి అవసరానికి మించి 44 మిలియన్ల డాలర్ల అత్యవసర సహాయాన్ని అందచేసింది మళ్ళీ రెండవసారి పి. పి. పి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఏ విధమైనటువంటి సహాయాన్ని చెయ్యలేదు. కానీ మళ్ళీ పి. యన్. సి. అధికారంలోకి వచ్చినప్పుడు ఈ సహాయాన్ని పెంచడం జరిగింది 1971 - 76 కాలంలో ప్రభుత్వం అతితక్కువస్థాయిలో సామ్రాజ్యవాద వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టినందుకు సహాయాన్ని విపరీతంగా తగ్గించివేయడం జరిగింది.

1959లో గయానా ప్రపంచ బ్యాంకు దాని అధీన సస్థలు కారిబియన్ దేశాలకిచ్చిన సహాయంలో 50% పొందింది. 1969 సం॥లో పారిశ్రామిక అభివృద్ధిసంస్థ యిచ్చినటువంటి సహాయంలో 76% చిలీ, కొలంబియా, ఇండియా, ఇండోనేషియా, కొరియా, పాకిస్తాన్, టర్కీ, గయానాలకు యివ్వబడింది. కాని 1971 సం॥ వచ్చేసరికి గయానాకు అందిన సహాయం అతి దారుణంగా పడిపోయింది. దానికి ప్రధానమైన కారణం అక్కడ వున్నటువంటి బర్న్‌హామ్ ప్రభుత్వం వామపక్షం వైపు మొగ్గుదలచూపి "అల్యూమినియం కంపెనీ ఆఫ్ కెనడా"ని జాతీయం చెయ్యడం, విదేశీయ అప్పులపై ఆధారపడటానికి వ్యతిరేకించటం కానీ యిదే బర్న్‌హామ్ 1969లో నయావలసప్రభుత్వాలకు నాయకుడు. అంతేకాకుండా ఆయన ప్రధాన బాధ్యత మార్క్సిజం-లెనినిజం గిటురాయిగా వున్నటువంటి పీపుల్స్ ప్రోగ్రెసివ్ పార్టీ అధికారంలోకి రాకుండా చూడటం - అంటే అమెరికన్ సామ్రాజ్యవాదుల అవసరాల్ని కాపాడినంత కాలం ఈ అప్పులు విపరీతంగా మంజూరు అయ్యాయి. ఆ పంథా మార్చుకొన్ననాడు ఋణాలలో విపరీతమైన కోత విధించడం జరిగింది.

జాతీయకరణకు వ్యతిరేకత

గయానాలోని అల్యూమినియం కంపెనీ ఆఫ్ కెనడా అధీనంలోని "డెమరారా బాక్సైట్ కంపెనీ"ని జాతీయం చేసినందుకు ప్రతిగా గయానా నీటి పారుదలాభివృద్ధి కోసం కోరినటువంటి 5 4 మిలియన్ డాలర్ల సహాయాన్ని ప్రపంచ బ్యాంకు తృణీకరించింది ఇటువంటి పరిస్థితులలోనే 1960లో బోలీవియాకు 1970లో పెరూకు ఋణసహాయం తృణీకరించడం జరిగింది.

గయానాలోని 'రినాల్డ్స్ మెటల్ కార్పొరేషన్' అధీనంలోని బాక్సైట్ గనులను జాతీయం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసి అమెరికా కాంగ్రెస్‌లోని సభ్యులు ఇటువంటి చర్యలు తీసుకొని ఋణాల విషయంలో అమెరికా తన పలుకుబడిని వుపయోగించి ఏసంస్థనుంచి ఎటువంటి ఋణ సహాయం అందకుండా చూడాలని కోరారు.

1975- 76 సం॥ లో 'రెనాల్డ్స్ మెటల్ కంపెనీ అనే అమెరికన్ సంస్థ అధీనంలో వున్న గయానాలోని బాక్సైట్ గనులను, బ్రిటన్ పంచదార గుత్త సంస్థలయిన "బూకర్ బ్రదర్‌ని"ని 'మాక్‌కోనెల్ అండ్ కంపెనీ'ని జాతీయం చెయ్యడానికి గయానా ప్రభుత్వం ప్రయత్నించినప్పుడు జమైకాలో లాగా అక్కడి ప్రభుత్వాన్ని పడగొట్టటానికి ప్రయత్నాలు జరిగినాయి.

1977 సం॥లో గయానాలో తీవ్ర ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పుడు సామ్రాజ్యవాదులు సహాయం చెయ్యడానికి- ప్రభుత్వ విధానాలు మార్చుకోమని తీవ్రమైన వత్తిడి తెచ్చారు. గయానా ప్రభుత్వం వామపక్ష విధానాలను విడనాడిన తరువాతే సహాయం తిరిగి అందించడం జరిగింది. 1977 జూన్‌లో అమెరికాకి చెందిన టాడ్‌మాన్ అనేమంత్రిగయానా తన సాంఘిక, ఆర్థిక విధానాల్ని మార్చుకొన్నదని దానితో తనకు ఎటువంటి పేచీలు లేవని, గయానా గురించి ఎటువంటి భయంలేదని చంకలు గుద్దుకున్నాడు. దీని భావమేమిటంటే గయానా ప్రభుత్వం విదేశీ పెట్టుబడులకి ద్వారాల్ని తెరవటానికి అంగీకరించటమే. ఆమేరకు 1978 జూన్ 12న అం. ద్ర.నితో గయానా ప్రభుత్వం ఒక రహస్య ఒప్పందాన్ని కుదుర్చుకొంది. (1981లో భారత ప్రభుత్వంలాగా —సం)

దాని ప్రకారం ఆగస్టు 1978 నుంచి గయానా ప్రభుత్వం అమ్మకం పన్ను 10% పెంచింది. గాసొలేన్, సిగరెట్లమీద సుంకం పెంచింది.

వీటికి తోడుగా వినిమయ వస్తువులమీద 1976 నుంచి ప్రభుత్వం యిస్తున్న ప్రత్యక్ష సబ్సిడీలను విపరీతంగా తగ్గించివేసింది.

పెరిగినటువంటి వ్యయాలను తట్టుకోవడానికి ప్రభుత్వం సరఫరాచేసే అనేక వస్తువుల ధరలు పెంచివేయడం జరిగింది. విద్యుచ్ఛక్తి, రవాణా, టెలికమ్యూనికేషన్‌లు మొదలైన వాటి చార్జీలు విపరీతంగా పెంచివేయడం జరిగింది.

అంతేకాకుండా కరెన్సీకి సంబంధించి ఎటువంటి కొత్త విధానాలు ప్రవేశపెట్టదు. అంతర్జాతీయ లావాదేవీలకు సంబంధించి ఎటువంటి క్రొత్త నిబంధనలూ విధించదు. దిగుమతులపై ఎటువంటి అంశలు విధించదు. ఈవిధంగా గయానాకు ఋణాలు మంజూరు చేయడం జరిగింది.

కాని దీనిపర్యవసానంఏమిటి? ఈ ఋణం వల్ల పరిస్థితులు మరింతగాదిగజారిపోయాయి 1960-65కాలంలో 1.5%వున్న తలసరి స్థూల జాతీయ ఉత్పత్తి 1970 - 75 వచ్చేసరికి 1 1% పడిపోయింది. 1981 మొదటి అర్థ భాగంలో బాక్సైట్ వుత్పత్తి 30% పడిపోయింది. పంచదార, ధాన్యం వుత్పత్తి 20% అనుకొన్న దానికంటే తగ్గిపోయింది. ఈ విధంగా గయానాలో అతి దారుణమైనపరిస్థితి నెలకొని వున్నదని 1980 బడ్జెట్ సమావేశంలో ఆర్థిక మంత్రి అంగీకరించడం జరిగింది. 1981 ఉత్తరార్థంలో విదేశీ మారక నిలవలు గయానాలో తగినంతగా వుండేవి. కానీ అవి తరిగి పోతూవున్నాయి. అదే

కాలంలో విదేశీ వ్యాపార అప్పులు విపరీతంగా పెరిగి పోతూవచ్చాయి. దీని పర్యవసానంగా దేశంలో వుత్పత్తి పెరుగుదల, ఆర్థిక పరిస్థితులు స్తంభించిపోయినాయి. ఈ ఉత్పత్తి స్తంబిన విపరీతమైన లోటు బడ్జెట్లకు దారి తీయడం కాకుండా అం.ద్ర.ని. యొక్క పరిమితులను కూడా చేరలేక పోయింది.

కానీ తిరిగి అం. ద్ర. ని 206 9 మిలియన్ గయానా డాలర్లతో కూడిన వొప్పందాన్ని చేసుకొన్నది. అం. ద్ర. ని తన రుణ విధానంలో అనేక మార్పులు తీసుకువచ్చింది. అయినప్పటికీ గయానా యొక్క విదేశీ వ్యాపార అప్పులుగాని, జాతీయ పొదుపుల్ని పెంచడంలోగాని, ప్రభుత్వ రంగంలో నిధులని పెంచటంలోగాని విఫలమైనది. అంతే కాకుండా అం. ద్ర. ని. ప్రభుత్వాన్ని విదేశాలలో పెట్టుబడులు పెట్టమనీ, దిగుమతులు తగ్గించమని ఆదేశించింది.

తిరిగి జూలై 1980 లో అం. ద్ర. ని, గయానా ప్రభుత్వాలు వేరొక వొప్పందాన్ని చేసుకొన్నవి. దీని ప్రకారం గయానాకు 3 సం॥ కాలంలో 132. 1 మిలియన్ డాలర్ల సహాయం లభిస్తుంది. గయానా ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైనప్పటికీ తిరిగి జూలై 1981లో 172 మి॥ డాలర్ల సహాయం అందచెయ్యడానికి వొప్పందం జరిగింది అంటే గయానాకి 1981-83 జూలై వరకు యింకా 125 మి॥ డాలర్ల రుణం పొందవలసి వుంటుంది.ఒప్పందం ప్రకారం రెండవ సంవత్సరంలో తీసుకోవల్సిన మొత్తం 73.7 మిలియన్ల అమెరికా డాలర్లకు సమానం అవుతుంది. అయితే ఈమొత్తాన్ని ఈ క్రింద చూపించిన విధంగానే ఖర్చు పెట్టాల్సి వుంటుంది:

1) ఆర్థిక పరిస్థితి వాస్తవంలో కనీసం 6% అయినా పెరగాలి.

2) ప్రస్తుతం బాలన్స్ ఆఫ్ పేమెంట్సులో వున్న వ్యత్యాసాన్ని స్థూల జాతీయ ఉత్పాదకంలో 20.4 % దగ్గర వుండేలా చెయ్యాలి.

3) బాలన్స్ ఆఫ్ పేమెంట్స్‌లోని మొత్తం లోటు 30 మిలియన్ల అమెరికన్ డాలర్లు మించకుండా చెయ్యాలి.

4) ప్రభుత్వ రంగంలోని మిగులును స్థూల జాతీయవుత్పత్తిలో 6 %అంటే137మి॥ గయానా డాలర్లకు పెంచాలి.

5) కేంద్రబ్యాంకువద్ద స్థూలవిదేశీ ఆస్తులు 52 మిలియన్ డాలర్ల పరిధి చేరుకొనేసరికి విదేశీ చెల్లింపుల బకాయిలు పూర్తిగా తీర్చివేయబడాలి.

ఇంకా కఠినమైన ఒప్పందాలు

అంతర్జాతీయ ద్రవ్య నిధి పెట్టిన సూచనలను సరిగా అమలుజరపటంలో ప్రభుత్వం విఫలం అవడం వలన మరింత కఠినమైన అంశాలు విధించబడ్డాయి చివరికి బరువంతా మోసేది మాత్రం కార్మికవర్గమే అయింది.

1981లో రెండుసార్లు బడ్జెట్లు వచ్చాయి. ఇవి ప్రజల పరిస్థితిని మరింత దిగజార్చాయి. టి.యు సి. అంతర్జాతీయ ద్రవ్యనిధి "కార్మిక వర్గ వ్యతిరేక సాధనం"అని అభివర్ణించింది.

అయితే ఇక్కడ అంతర్జాతీయ ద్రవ్యనిధి మాత్రమే ఈ సాధనం కాదు. దీనికితోడుగా పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ (పి.యన్.సి.) వుంది. ఈ రెండింటి రాజకీయ మాయా కలయికే ఈ విపత్తులన్నింటికీ కారణం అని గుర్తించాలి

దీని అంతటి వలన కార్మికులు జీవించడానికి అడుక్కోవల్సి వస్తుందని, దొంగిలించుకొని తినవల్సి వస్తుందని అంటే ఆశ్చర్యపోవల్సింది ఏమీలేదు. వేతనాలు ధరలపెరుగుదలతో పోల్చితేచాలావెనక బడివుంటున్నాయి. 1975-76లో ధరలు 60% పెంచబడ్డాయి అయితే వేతనాలు మాత్రం 38% మాత్రమే పెంచబడ్డాయి.

అపాయకర పరిస్థితి

అంతర్జాతీయ ద్రవ్యనిధి, పి.యన్.సి.-రెండింటికలయిక సాంఘికస్థితిగతులని మరింత దిగజార్చింది.

ఇదంతే అలా వుండగా మొత్తం కారిబియన్ ప్రాంత దేశాలన్నింటిలోకి గయానా ఒక్కటే ఐదుగురు ఉపరాష్ట్రపతుల్ని కలిగి విపరీతమైన జీతాలు గలిగిన మంత్రుల్ని కలిగి వున్న దేశం. అయితే యింకో ప్రక్క కార్మికులకి మాత్రం 1981లో 10% వేతన పెరుగుదల లభించింది.

ఆర్థిక విధానం

దేశీయ, విదేశీయ విధానాలలో పచ్చి మితవాద ధోరణలు తలఎత్తాయి.

జాతీయత నిలిపివేయబడింది విదేశీయ ప్రైవేటు పెట్టుబడి తగ్గించబడుతుందని అత్యధిక మెజారిటీ వున్న కోపరేటివ్‌తో గానీ, ప్రభుత్వంతో గాని కలిసి పని చేయవలసి వుంటుందని చెప్పబడింది. నౌకా నిర్మాణంలో, బాక్సైట్ ఖనిజాల విషయంలో ఉమ్మడివ్యవహారాలు మొదలయినాయి.ఆంగ్లో-అమెరికన్ కంపెనీ ఆఫ్ సౌత్ ఆఫ్రికా అనే గుత్త సంస్థతో దగ్గర సంబంధాలు కలిగివున్న అమెరికన్ ఫిలిప్ బ్రా, అనే సంస్థ బాక్సైట్ అమ్మకాలపై లాభదాయకమైన 5% కమీషన్ పొందుతోంది.

నయావలస విధానం

జాతీయం చేయబడ్డ బాక్సైట్, చక్కెర పరిశ్రమలని సహకార సంఘాలుగా మార్చాలని యిదే 'సహకార సామ్యవాదం' అనే ఊహాతత్వాలు గూడ ప్రచారం చెయ్యబడుతున్నాయి. ఇది విదేశాలలో పెరుగుతున్న పి. యన్. సి. పెట్టుబడిదారులకు మంచి అవకాశంగా తయారయ్యింది.

1978-81 అభివృద్ధి విధానాన్ని గనక పరీక్షిస్తే పి. యన్. సి. పారిశ్రామిక-వ్యవసాయక రంగాలలో ఎంత కొరగానివిధానాన్ని అవలంబిస్తోందో అర్థం అవుతుంది. న్యూ ఇన్‌వెస్ట్‌మెంట్ కోడ్ (1979) ప్రకారం పశ్చిమజర్మనీ, ఫ్రెంచ్ కంపెనీలు రెండింటికి యురేనియంపై కన్సెషన్స్ యివ్వబడ్డాయి. అలాగే ఖనిజ, నూనెల విషయంలో ఒక కెనడియన్, మరియొక అమెరికన్ సంస్థలకు కన్సెషన్స్ యివ్వబడ్డాయి.

సామ్రాజ్యవాద వత్తిడి

అంతర్జాతీయ ద్రవ్యనిధి, అమెరికా, నయావలస విధానాన్ని అవలంబిస్తున్న పి. యన్. సి ల ఆదేశాలను జాన్, యమ్. గోస్కో వాషింగ్టన్ పోస్ (జూన్ 28, 1980)లో చక్కగా వివరించారు. "కారిబియన్ ప్రాంతంలో వామపక్ష శక్తులు బలపడకుండా చూసే అమెరికన్ ఎత్తుగడలో ఒక భాగంగానే గయానాలోని సోషలిస్టు ప్రభుత్వం అంతర్జాతీయ ద్రవ్యనిధి ఆదేశించిన పచ్చి మితవాద ఆర్థికపంథాను చేపట్టింది"

"అంతర్జాతీయద్రవ్యనిధియొక్క సూచనలను అనుసరించాలి అంటే, బర్న్‌హామ్ రాజకీయ గా అతికష్టమైన పనులు చేయాల్సి వుంటుంది. విద్యుచ్ఛక్తి, పట్టణ రవాణా సౌకర్యాల్లో ధరలు పెంచడం, అధిక ధరల్ని అరికట్టడానికి ఇచ్చే సబ్సిడీలను ఎత్తివేయడం మొదలైనవి"

ప్రభుత్వ రంగాన్ని రూపుమాపడానికి తీవ్ర వొత్తిడులు తేబడుతున్నాయి. అది కూడా విదేశీ వ్యాపార విషయంలో అయితే మరింత ఎక్కువగా పశ్చిమ దేశాన్ని ఫ్రీ మార్కెట్ ఆర్థిక విధానంవైపు త్రిప్పడానికి విశ్వ ప్రయత్నాలు జరుగుతున్నాయి

(మిగతా 12వ పేజీలో)

ప్రపంచాన్ని పొంచిచూస్తున్న అణ్వాస్త్రయుద్ధప్రమాదం

అణ్వాస్త్రయుద్ధం జరిగితే, దాని ఫలితాలు భయంకరంగా, ఊహాతీతంగా ఉంటాయి. ఈ విషయాన్ని గురించి మరింత విపులంగా తెలుసుకునేముందు 1945లో హిరోషిమా, నాగసాకీలపై జరిగిన అణ్వస్త్ర ప్రయోగానికి సంబంధించిన దారుణ ఫలితాలను గురించి తెలుసుకుందాము.

అది 1945 ఆగస్టు 6వతేదీ. జపాన్‌లోని హిరోషిమానగరంలో ఉదయం 8-45గంటల సమయం. వీధులన్నీ జనాలతో కిటకిటలాడు తున్నాయి. పనిపాటలలోకి వెళ్ళేవారితోను, పాఠశాలలకు వెళ్ళేవారితో వీధులన్నీ కళకళ లాడుతున్నాయి.

అకస్మాత్తుగా వాతావరణ హెచ్చరికలు జరిగాయి. కాని, ఎవ్వరూ పట్టించుకోలేదు. అది వారికి ఆ యుద్ధసమయంలో మామూలై పోయింది.

ఆకాశంలో ఒకే ఒక శత్రు విమానం వున్నది. ఆ విమానం నగరంపై ఎగురు తున్నది.

ఆకాశం నుంచి ఏదో పడుతున్నది. అది సరిగా కనిపించడంలేదు కూడా. ఆటం బాంబు చాలా చిన్నది. దాని బరువు రెండు కిలోగ్రాములు. టెన్నిస్ బంతికంటె కొంచెం పెద్దదిగా వుంటుంది.

పది, పదిహేను సెకండ్లలో అది నగరం మధ్యలో పడనేపడింది.

ఇంకే మున్నది? వెయ్యిమంది సూర్యుల వెలుగునుమించిన వెలుగు, మహోష్ణోగ్రత ఉద్భవించాయి.

దానివైపుచూస్తున్నవారి నేత్రాలు దగ్ధమై పోయాయి అంతే వారికి దృష్టి నశించింది.

షాపులకువెళ్ళే వ్యాపారస్తులు, అందాల చిరునవ్వులు చిందిస్తూ పాఠశాలలకు వెళ్ళే బాలబాలికలు, షాపులకు వస్తున్న మహిళలు అందరూ ఒక్కక్షణంలో ఈ ప్రపంచం నుంచి అంతర్హితులైపోయారు ఆ ఆటం బాంబు సృష్టించిన మహాగ్నిగుండంలో వారు భస్మీపటలమైపోయారు. వీరి చితా భస్మం కూడా ఆ ప్రాంతంలో కనిపించలేదు.

గోడల ప్రక్కన,భవనాలలోను దాక్కున్న వేలాదిమంది ఆ మహోష్ణోగ్రతవల్ల అనిర్వచనీయమైన దప్పికకు లోనైనారు. సజీవులై వున్నవారు నగరం చివర వున్న నదుల వద్దకు మంచినీటి కోసం పరుగెత్తారు.

క్షణాలలో విధ్వంసం

మరికొద్ది క్షణాలలో బ్రహ్మాండమైన విస్ఫోటం. అక్కడ వున్న భవనాలన్నీ కూలి పోయి శకలాలైపోయాయి. కొన్ని మైళ్ళ మేరలో వున్న మనుషులు, లారీలు, కార్లు ముక్కముక్కలైపోయి కొన్ని వందల మీటర్ల దూరం వరకు విసిరివేయబడ్డాయి.

ఎక్కడ చూచినా శవాలు, శవాల గుట్టలు. వెంటనే ఆ మహాగ్నిగుండం నుంచి ప్రచండ మహోష్ణవాయువులు వీచసాగాయి. ఆదెబ్బకు పట్టణమంతా మాడిపోయింది.

ఆ పట్టణమంతా గాఢాంధకారం వ్యాపించింది.కుక్కగొడుగుఆకారంలో4వేలఅడుగుల ఎత్తుకు ఆకాశానికి ఎగసిన నల్లని పొగవల్ల పట్టణమంతా గాఢాంధకారం అలముకున్నది. అది సూర్యుని కప్పివేసింది హిరోషిమాలో మిగిలివున్న ప్రతివస్తువుపై అది అణు ధూళిని విరజిమ్మింది.

ఈ ప్రమాదాలన్నింటిని అధిగమించి బ్రతికినవారు ఈ రేడియో యాక్టివ్ ధూళి వల్ల వ్యాధులతో మృతిచెందారు.

ఆ భయంకరమైన ఉదయాన హిరోషిమాలో రెండులక్షల 40 వేల మంది ఒక్క గంటలో ఘోరదుర్మరణం పాలైనారు. ఆ ప్రమాదం నుంచి బయటపడి బ్రతికిన తల్లుల గర్భకోశం నుంచి బయటపడిన యువతీయువకులలో నేడు రక్తపు క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తున్నాయి" అని "లండన్ టైమ్స్" సైన్స్ ఎడిటర్ వ్రాశాడు.

కాగా, ఇప్పటి ఆయుధాలు కొన్ని ఆ బాంబుల కంటే నూరురెట్లు, మరికొన్ని వెయ్యి రెట్లు మారణశక్తి కలిగినట్టివి.

"విశ్వశాంతి లేదా విశ్వవినాశం"- వీటిలో ఏదికావాలో ఆధునిక మానవుడు తేల్చుకోవాలని ఆయన హెచ్చరిస్తున్నాడు.

హిరోషిమా, నాగసాకీ మేయర్లు 1976లో ఒక నివేదికను ప్రచురించారు దానిలో ఈ క్రింది అంకెలిచ్చారు. హిరోషిమాలో ఆటం బాంబు ప్రయోగంవల్ల ఏర్పడిన వివిధ దుష్ఫలితాలకు మూడు లక్షల 20 వేల మంది గురిఅయ్యారట వీరిలో లక్ష మంది వరకు 1945 డిసెంబర్ నాటికే మరణించారు 1950 నాటికి మరొక రెండు లక్షల మంది మృతి చెందారు. అదేవిధంగా 1945 ఆగస్టు 9వ తేదీన ఆటంబాంబుకు గురిఅయిన నాగసాకీలో కూడా ఇలాగే ఎందరో దారుణ దుర్మరణానికి లోనైనారు.

వేలాది అణ్వాస్త్రాలు

నేడు ప్రపంచంలో మొత్తం 40 వేల అణ్వాస్త్రాలున్నాయి. వీటి మొత్తం ప్రేలుడు శక్తి హిరోషిమా బాంబుకు పదిలక్షల రెట్లు. భూమిపై వున్న ఒక మిస్సైల్ ఒక నిర్ణీత లక్ష్యాన్ని దెబ్బతీయడానికి 30 నిమిషాలు పడుతుంది. లేదా ఒక జలాంతర్గామి నుంచి ప్రయోగించబడిన మిస్సైల్ ఇంతకంటే తక్కువ వ్యవధి తీసుకుంటుంది. అందువల్ల ఆ దాడికి గురయ్యే పట్టణంలోని జనాభాను ఖాళీచేయటానికి కూడా తగినంత వ్యవధి లభించదు.

ఉదాహరణకు, డెట్రాయిట్ నగరం జనాభా 40 లక్షలు. ఆ నగరంపై ఒక మెగాటన్ను ఆటం బాంబును ప్రయోగిస్తే, అయిదు లక్షల మంది మరణిస్తారు; ఆరు లక్షల మంది గాయపడతారు.

విద్యుత్ బోర్డులో తొలగింపు

రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డులో గత ఏడెనిమిది సంవత్సరాలుగా పనిచేస్తున్న దాదాపు 3000 మంది క్యాజువల్ లేబరర్లను జూన్ 1 నుంచి ఉద్యోగాలునుంచి తొలగించడం జరిగింది.వారి ప్రతినిధిని కలుసుకుని మాట్లాడగా రాష్ట్రం మొత్తంమీద గత ఏడెనిమిది సంవత్సరాలుగా విద్యుచ్ఛక్తి బోర్డు అధ్వర్యంలో 7600 మంది క్యాజువల్ లేబరర్లు పనిచేస్తున్నారని, గతనెలలో 3400 మందిని, ప్రస్తుతం 3000 మందిని తొలగించారని చెప్పారు.

సీనియారిటీ ప్రాతిపదికపై ప్రమోషన్లు ఇస్తామని చెప్పి గత ఏప్రిల్ 29 న ఇంటర్వ్యూలు కూడా తీసుకున్నారని, ప్రమోషన్లు ఇవ్వకపోగా ఉద్యోగాల నుంచే తొలగించారని వారు చెప్పారు.

గత ఏడాది ఏప్రిల్ ఒకటిన తమకు దిన భత్యం 17-30 రూపాయలు చెల్లించగలమని కుదుర్చుకున్న ఒప్పందాన్ని కూడా మండలి అమలుపరచలేదని వారు పేర్కొన్నారు గతంలోనెలకు 19రోజులు మాత్రమే పని చేయించుకునేవారని, యిప్పుడు నెలకు 26 రోజులు పని చేయించుకుంటున్నారని కాని దినభత్యం 8 రూపాయలు చెల్లించేవారని ప్రతినిధులు చెప్పారు.

నెల్లూరుజిల్లా లారీ వర్కర్స్ యూనియన్ మహాసభ

నెల్లూరు జిల్లా లారీ వర్కర్స్ యూనియన్ మహాసభ 6-6-1982 సాయంత్రము 6 గంటలకు శ్రీ పాండురంగ అన్నదాన సమాజంలో యూనియన్ అధ్యక్షుడు శ్రీ పి మాలకొండారెడ్డి అధ్యక్షతనజరిగినది. సభలో 319 మంది వర్కర్సు పాల్గొన్నారు.

తొలుత ఆశయ సాధనలో అసువులు బాసిన అమరవీరులపై సంతాప తీర్మానాన్ని కామ్రేడ్ మోహన్ ప్రవేశపెట్టగా మహాసభ శ్రద్ధాంజలి ఘటించింది.

తరువాత కార్యకలాపాల సమీక్షను యూనియన్ ఉపాధ్యక్షుడు శ్రీ జి యం. కె. రెడ్డి ప్రవేశపెట్టగా సభ్యులు చర్చలో పాల్గొన్నారు జమా-ఖర్చును శ్రీమోహన్ ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

మహాసభకు సౌహార్ద్ర ప్రతినిధులుగా హాజరయిన వివిధ జిల్లాల లారీవర్కర్స్ నాయకులు పాల్గొన్నారు. మొదట చిత్తూరు జిల్లా లారీ వర్కర్సు యూనియన్ (ఎ ఐ టి యు.సి. అనుబంధసంస్థ) అధ్యక్షులు శ్రీ ఎ. రాజేంద్ర మాట్లాడుతూ లారీ వర్కర్సుకు సరియైన రక్షణ లేదని, కొన్ని ప్రాంతాల్లో లారీ వర్కర్లకు సరైన ఆహారము వుండడం లేదని అన్నారు. మనుబోలు లారీ స్టాండును నెల్లూరు జిల్లా లారీ వర్కర్ల పోరాట ఫలితంగానే ఏర్పాటు చేశారు. కాని ఆ స్టాండులో ఎండకు తల దాచుకోవడానికి షెడ్డు లేదన్నారు. లారీ ట్రాన్సుపోర్టు చాలా కీలకరంగం. అది మీ రిపోర్టులోనే విశదీకరించారు. అటువంటి రంగాన్ని మనము ఇతరులకు వదలకుండా ఎర్రజండా నాయకత్వాన్నే వుండేట్లు చూడాలి అన్నారు.

కర్నూలుజిల్లా లారీ వర్కర్సు యూనియన్ ప్రధానకార్యదర్శి కామ్రేడ్ నాగరాజు మాట్లాడుతూ నెల్లూరుజిల్లా లారీ వర్కర్సు యూనియన్ నుంచి తామెంతో నేర్చుకున్నామని, ఈరోజు కర్నూలు జిల్లాలో లారీ వర్కర్సు యూనియన్ను, సి ఐ టి.యు.ను నాశనం చేయాలని జరిగే ప్రయత్నాలను వివరించారు ఇంకా పరాన్నభుక్కులకు సమాజంలోస్థానంవుండకూడదని, శ్రమించిపనిచేసే వారికే సమాజంలో గౌరవ ప్రతిష్టలుండాలని అన్నారు.

శ్రీకాకుళంజిల్లా లారీవర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీ వై. సిద్దయ్యగారు మాట్లాడుతూ నెల్లూరు యూనియన్ సహకారము, అనుభవాలు యితర ప్రాంతాలకు అవసరమని, వారిజిల్లాలో లారీవర్కర్సు మధ్య నక్సలైట్లు ఏవిధంగా ప్రచారము చేస్తున్నది వివరించి రాష్ట్రం మొత్తంగా లారీ వర్కర్సు ఫెడరేషన్ ఏర్పాటుచేయాల్సిన అవసరం ఎంతైనా వున్నదని చెప్పారు.

సింగరాయకొండ లారీ వర్కర్సు యూనియన్ అధ్యక్షులు, మెకానిక్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తాము మొదటినుండి నెల్లూరు జిల్లా యూనియన్ గైడ్లైన్సుపైనే నడిచామని, నెల్లూరు యూనియన్ అంటే మాకెంతో గౌరవమని, ప్రస్తుతం మేము ఒంగోలు జిల్లాలో వున్నాము గనుక యిరువురి సహకారముతో మేము ముందుకు పోతామని అన్నారు.

నెల్లూరుజిల్లా రైతు నాయకులు శ్రీ కె. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ధాన్యానికి, ప్రత్తికి, చెరుకునకు ధర పడిపోయి రైతులు బాధలు పడుతున్నారని, కాని కొనుగోలుదారులు మాత్రం బజార్లో బియ్యము, గుడ్డ, చెరకు ఎక్కువ ధరకు కొనాల్సి వస్తుందని, దీనికి కారణం యిందిరా కాంగ్రెస్ అనుసరిస్తున్న దివాళాకోరు రాజకీయాలేనని అన్నారు.

పట్టణ యువజన సంఘ అధ్యక్షులు, ప్రముఖ లాయరు అయిన పి. బలరామయ్య మాట్లాడుతూ లారీ వర్కర్సుయూనియన్తో నాకు కూడా ఎక్కువ సంబంధాలున్నాయి. వీళ్లు రాత్రింబవళ్లు రెస్టులేకుండా బండి తోలుతున్నందువల్ల ఎక్కువగా యాక్సిడెంట్లు జరుగుతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో వారికి రెస్టు రూములు ఏర్పాటుచేయాలని, ప్రతి వర్కరు జనతా ఇన్సూరెన్సు స్కీము కట్టాలని సలహా యిచ్చారు.

విద్యార్థినాయకుడు కామ్రేడ్ మాల్యాద్రి మాట్లాడుతూ లారీ వర్కర్సు యూనియన్ రిపోర్టు, చర్చలు విన్నతరువాత నాకు చాలా సంతోషంగా వుందని, ఎందుకంటే వారు తమ పని మాత్రమే చూచుకొని సరిపెట్టుకోకుండా యితర కార్యక్రమాలలో గూడ పాల్గొంటున్నారని, ఆ విధంగా ప్రతి యూనియన్ రాజకీయ చైతన్యం పెంచుకోవాలని అన్నారు.

చివరగా యూనియన్ అధ్యక్షుడు శ్రీ వి. మాలకొండా రెడ్డి మాట్లాడుతూ 1981 నుండి ప్రారంభించిన యూనియన్ పది సంవత్సరాలు పూర్తిచేసుకొంటున్నదని, ఈ పదిసంవత్సరాలలో యూనియన్ చాల ఆటుపోట్లకు తట్టుకొన్నదని యూనియన్ను దెబ్బతీయాలని యజమానులు పోటీ సంఘాలు పెట్టినా అవి నామమాత్రంగానే నిలిచిపోయి, ఏకైక యూనియన్గా నిలబడి లారీ వర్కర్ల ప్రతి సమస్యను తానే తీసికొని పని చేస్తోందని చెప్పారు. యిదంతా కార్మికుల మధ్య ఐక్యతవల్ల, సి ఐ.టి యు. కార్మిక సంఘాల సహకారంవల్లనే సాధ్యమౌతుందని, ఇంత మాత్రమే చాలదని ఈ రోజు దేశంలో జరుగు రాజకీయ పరిణామాలకు ప్రతి కార్మికుడు స్పందించాల్సిన అవసరమున్నదని, అందుకు తగ్గట్లు రాజకీయ చైతన్యం పెంపొందించుకోవాలని అన్నారు. లారీ వర్కర్లు తక్కిన డిమాండ్లతోపాటు ఈ క్రింది డిమాండ్ను తప్పనిసరిగా చేర్చాలని అందుకు ప్రభుత్వంతో మనమొక్కరిమే కాకుండా రాష్ట్రం, దేశం మొత్తంమీద కార్మికులు కలసి పోరాడాలని అన్నారు.

డిమాండు

"బస్సులను," లారీలను ట్రాన్సుఫరు చేయునపుడు హెచ్.పి. క్లియరెన్సుతోపాటు కార్మికుల వద్ద నుండి జీత-భత్యాల బకాయిల క్లియరెన్సు సర్టిఫికేట్ వుంటేనే బండిని ట్రాన్సుఫరు చేయాలి."

ట్రాన్సుఫరు చేయునపుడు ఫైనాన్సు కంపెనీ డబ్బుకు గ్యారంటీ వున్నచో, కార్మికుల జీతభత్యాలకు ఎందుకు గ్యారంటీ వుండకూడదని అన్నారు.

తరువాత ఈక్రింది నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

అధ్యక్షులు : శ్రీ వి. మాలాకొండారెడ్డి

ఉపాధ్యక్షులు : శ్రీ జి. యం. కె. రెడ్డి శ్రీ యస్. డి. మీరామొహిద్దీన్

కార్యదర్శి:- శ్రీ యస్. రాధాకృష్ణమూర్తి సహాయకార్యదర్శులు:- శ్రీ యస్. కె. భాషా శ్రీ కె. మోహనరావు. కోశాధికారి:- శ్రీ టి. కృష్ణయ్య.

మరో 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవటంజరిగింది. సభానంతరం ఆంధ్ర ప్రజానాట్యమండలి నెల్లూరు దళం వారిచే 'యర్రజెండానీడలో' అను నాటిక ప్రదర్శించడం జరిగింది.

ఎ. పి. ఎస్. టి. సి. వర్కర్సు ఫెడరేషను ప్రభుత్వానికి సమర్పించిన మెమోరాండము

ఇండియాలో నేషనల్ టుబాకో కంపెనీ రెండవ స్థానం అలంకరించింది. ఈ సంస్థలో 13, 075 మంది కార్మికులు పనిచేస్తున్నారు, గుంటూరు, చిక్కావోలు, రిడ్రైనింగు ఫ్యాక్టరీస్ 10 బ్రాంచీలు ఉన్నవి. ది. 6-12-70వ తేదీన గుంటూరు ఫ్యాక్టరీ 2,000, చిలకలూరిపేట 15,000, ఒంగోలు 1,400, మంగళగిరి 1,375, లేమల్లె 975మంది కార్మికులు నిరుద్యోగమునకు బలి అయినారు.

1979 సంవత్సరము వరకు తలఒకటికి రూ. 7-55లు ఇస్తూ ఉన్నారు. 1980 సంవత్సరములో తలఒకటికి రూ. 6-25లు ఇస్తామని నోటీసుబోర్డు వేసినారు. ఏ బ్రాంచిలో కూడా పనికివెళ్ళుటకు నిరాకరించారు. చిలకలూరిపేట బ్రాంచీలో మేనేజిమెంటుపై కార్మికులు ఒత్తిడి తీసుకొనిరాగా, మేనేజిమెంటు డి.యస్.పి ద్వారా ఐ ఫారములు అందజేయమని కార్మికులకు ఇచ్చినారు. ఐ ఫారములు కార్మికులు పూర్తిచేసిమేనేజిమెంటుకు అందజేసినారు. వారిలో 300 మందికి మాత్రమే గ్రాట్యూటీ ఇచ్చి, మిగిలినవారికి గ్రాట్యూటీ లేదని చెప్పినారు. కార్మికులందరు యస్ ఫారములు ఐ ఆర్.ఓ 11 సర్కిల్‌కు దాఖలు చేసినారు. 5 సంవత్సరములు మొదలు 40 సంవత్సరములు సర్వీసులు గలవారున్నారు.

మంగళగిరి బ్రాంచీలో కార్మికులకు గ్రాట్యుటీ ఇవ్వనందున ఐ ఫారములు పెట్టుకొనమని మేనేజిమెంటు తెలియపరచగా కార్మికులు ఐ ఫారములు పూర్తిచేసి, మేనేజిమెంటుకు దాఖలు చేయగా వారుసంతకము, తారీకు వేసి రశీదు యిచ్చినారు. కార్మికులకు మేనేజిమెంటు గ్రాట్యూటీ చెల్లించలేదు. 5 సంవత్సరములు నుండి 40 సంవత్సరముల వరకు సర్వీసుగలవారు ఉన్నారు.

మంగళగిరి బ్రాంచీలో యస్ ఫారములు పెట్టుకోమని ఫెడరేషన్‌కు ఐ. ఆర్. ఓ. నోటీసు పంపించినారు. అదే ప్రకారముగా యస్ ఫారములు దఖలు పరిచినారు.

ఐ ఆర్.ఓ. 1, 11 సర్కిల్ కార్మికులకు మేనేజిమెంటుకు విచారణజరుపుటకు నోటీసు పంపించగా, ఇరు పార్టీల వాదన విని జడ్జిమెంటు ఇచ్చినారు ఆ జడ్జిమెంటు పరిశీలన చేసినచో తమరే గ్రహించగలరు.

చివరకు కార్మిక వర్గమునకు గ్రాట్యూటీ ఎగనామా పెట్టి కాలయాపన చేయుటకు డిప్యూటీ కమీషనరు కోర్టులో కూడా అప్పీలు చేసినారు.ఇరుపార్టీల వాదన విని జడ్జిమెంటు కార్మికులకు వ్యతిరేకముగా ఇచ్చినారు. మేనేజిమెంటు అన్ని బ్రాంచీలలోనూ ఉన్న కార్మికులకు, 1981లోదీపావళికి, సంక్రాంతికి గ్రాట్యుటీ ఇస్తామని చెప్పి కార్మికులకు భ్రమలు కల్పించి కార్మికులు మేనేజిమెంటు ఎత్తుగడలను అర్థం చేసుకొని కంట్రోలింగు అథారిటి సెంట్రల్- విజయవాడకు యస్ ఫారములు దాఖలు చేసినారు. ది.31-5-82వ తేదీన విజయవాడలో ఆర్గ్యుమెంటు జరిగినది. 7 మాసములు గడిచిన తరువాత కార్మికులు యస్ ఫారములు దాఖలు చేసినారు, ఇది చెల్లదని మేనేజిమెంటు వాదన. కార్మికుల తరపున ఎందుకు ఆలస్యమయిందని దానికి కారకులు ఎవరో వివరించినారు.

మంగళగిరి బ్రాంచీలో 40 సంవత్సరముల సర్వీసుగల వారు జెడ్డా వందనం, పోరుమళ్ళ బ్రహ్మయ్య, జొన్నలగడ్డ నాగయ్య, దానమేయినసుబ్బారావు(లైన్‌మేస్త్రి)జొన్నలగడ్డ అన్నమ్మ, జి. మరియమ్మ గ్రేడరు. వీరు ఐ ఫారములు యస్ ఫారములు కోర్టులో పెట్టినందుకు ది 23-5-82 వేసిన నోటీసు బోర్డు నుండి తొలగించినందుకు కార్మికులు చాలా ఆందోళనగా ఉన్నారు.

గుంటూరుఫ్యాక్టరీలో ఒంగోలు, లేమల్లి ఐ, ఎస్ ఫారములు లేకుండానే గ్రాట్యుటీ ఇచ్చినారు చిలకలూరిపేట, మంగళగిరి బ్రాంచీలలో ఐ, ఎస్. ఫారములు దాఖలు చేసినను, 100 కి 20 మందికి మాత్రమే గ్రాట్యూటీ చెల్లించినారు. జిల్లా కలెక్టరు యస్. పి. మేనేజిమెంటును పిలిచి కార్మికులకు గ్రాట్యుటీ ఇవ్వమని చెప్పినారు. దానికి అంగీకరించి ఇస్తామని చెప్పినారు, కాని ఇవ్వలేదు.

కాబట్టి మేనేజిమెంట్‌పై ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి కార్మికులందరికీ గ్రాట్యుటీ ఇప్పించగలరని అట్లు జరగని పక్షంలో రాబోయే పరిణామాలకు కార్మికులు బాధ్యులుకారని తెలియజేయుచున్నాను.

షరా : చిలకలూరిపేట - కందిమళ్ళ కంపెనీలో 1 1/2 సంవత్సరము నుండి గ్రేడింగు చేయుచున్నారు 2. మార్ఫ్యూరు షా టుబాకో కంపెనీ పేరుతో గ్రేడింగుచేయుచున్నారు. 3 గుంటూరు రీడ్రైనింగు ఫ్యాక్టరీ గ్రేడింగుహాలు 567 గోడౌను గోదావరి టుబాకో కంపెనీవారికి అద్దెకు ఇచ్చినారు.

వ్యాగన్ వర్క్‌షాపు కార్మికుల ఐక్య కార్యాచరణ కమిటీ విజ్ఞప్తి

ది. 5-5-82 నుండి ఈరోజువరకు మనం ప్రశాంతంగా మన డ్యూటీలు చేసుకుంటున్నాము. కాని షాపు అధికారులు కొంత బెదిరింపు ధోరణిలో కార్మికులను ఇబ్బంది పెడుతున్నారు పాస్,లోన్స్‌వంటిసౌకర్యాలను తిరస్కరిస్తున్నారు చేసిన తప్పు సరిదిద్దుకోవ దానికి అధికారబలం, అంగబలం ప్రదర్శించ దానికిఅధికారులు ప్రయత్నిస్తున్నారు. మనం డ్యూటీలకొచ్చిన 15రోజుల తర్వాత "సర్వీస్ బ్రేక్" చేసినట్లు నోటీసు వేశారు. దీన్ని గురించి కార్మికులెవ్వరూ కంగారుపడవలసిన పనిలేదు. ఈ "సర్వీసు బ్రేక్" తొలగించుటకు ప్రయత్నాలు ముమ్మరంగా ప్రారంభించాము. అప్పటివరకు 5సం॥ల సర్వీసు దాటిన కార్మికులు యిదివరకు ఒక ఫ్రీ పాస్ వాడుకున్నవారైనా, యిప్పుడు మరొక పాస్ తీసుకొనవచ్చును మరియు 5 సం॥ ల లోపు సర్వీసు కల్గిన కార్మికులకు యిదివరకు ఫ్రీ పాస్ వాడుకోనటువంటి వారికి యిప్పుడు ఒక ఫ్రీ పాస్ లభిస్తుంది. ఈ విధంగా కాక పాస్, లోన్ తిరస్కరింపబడిన కార్మికులు ఐక్య కార్యాచరణ కమిటీలోని యూనియన్ల కార్యకర్తలకు తమ వివరాలు యిచ్చి తగిన చర్య తీసుకునేందుకు వీలు కలిగించవలసిందిగా కోరుచున్నాము.

ది 21-4-82 నుండి 26- 4- 82 వరకు చట్ట వ్యతిరేక సమ్మెలో పాల్గొన్నట్లు తెలిపే విధంగా కొన్ని కాగితాలు తయారుచేసి కార్మికుల సంతకాల కొరకు అధికారులు పంపుతారని తెలుస్తూంది. కనుక కార్మికులు ఏ ఒక్కరూ, ఏ విధమైన కాగితాలైనాసరే ఈ కమిటీ దృష్టికి తీసుకురానిదే కమిటీ ఆమోదం లేకుండాఎవ్వరూ సంతకాలు పెట్టవద్దని కార్మికులందరికీ మరొకసారి మనవి చేస్తున్నాము.

లారీట్రాన్స్‌పోర్ట్ కార్మికులు - వారిస్థితి గతులు

(12వ పేజీ తరువాయి)

లక్షలాది కార్మికుల బాగుకొరకై ఏచర్య చేబట్టడంలేదు. అంతేగాక కార్మికులపై అతి దుర్మార్గంగా దాడులుచేస్తూ ఏ చట్టాన్ని ఖాతరు చేయకుండా కార్మికుల్ని అణిచివేస్తున్న యజమానులకే మద్దతు ప్రకటిస్తున్నది. ఆక్సిడెంటు చేసే లారీడ్రయివర్‌లను ఉరితీయాలని మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్యగారి సూక్తులు ఈ సందర్భంలో ప్రభుత్వ విధానం ఎలాంటిదో తెల్సుకోడానికి ఉపయోగపడగలవు. 198 మే నెలలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు ప్రదర్శనగా వెళ్ళి నాటి రవాణా శాఖమంత్రి రోశయ్యగారికి అనేకకోర్కెలతో విజ్ఞాపనపత్రం సమర్పించడం జరిగింది. అది మంత్రిగారి ఫైలులో ఏ చలనం లేకుండా పడి వుంటున్నది. ఆ రోజు ఇచ్చిన హామీలు అమలు వర్పింది లేదు.

లారీ కార్మికుల స్థితిగతులు చాలా దారుణంగా వున్నాయి. హామీలు, చట్టాలు, సూత్రాలు, న్యాయశాస్త్ర నిర్వచనాలు ఏవీ నేడు లారీ కార్మికుల సమస్యల్ని పరిష్కరించలేవు సుసంఘటితమైన రాష్ట్ర వ్యాపిత ఉద్యమ నిర్మాణం ద్వారా, అవసరమైన ప్రత్యక్ష పోరాటాల్ని నిర్వహించినప్పుడే ప్రభుత్వంలో చలనం కలిగించి కోర్కెలను సాధించుకోవచ్చు అందుకు నడుంబిగించి కదలవలసిన కర్తవ్యం ఇప్పటికే సంఘాలుగా ఏర్పడి పని చేస్తున్న కార్మికులపై నే ఎక్కువగా నున్నది. ఈ క్రింది తక్షణ కోర్కెల సాధనకై రాష్ట్ర వ్యాపితంగాలారీ కార్మికులు కదలాలి - కదలించాలి.

1) అవసరాల ప్రాతిపదికకై కనీస వేతనాల్ని నిర్ణయించాలి ఆ లోపుగా 1981 సం॥ కనీస వేతనాల్ని ఖచ్చితంగా అమలు జరిపేందుకు చర్యలు తీసుకోవాలి

2) ఉద్యోగంలో చేరిన ప్రతికార్మికుడికి అప్పాయింట్ మెంట్ ఆర్డర్సును ఇవ్వాలి ట్రిప్ షీట్‌లో డ్రయివర్ పేరుతోపాటు క్లీనర్ పేరు కూడా ఉండేట్లు నిబంధనల్ని సవరించాలి

3) లారీ కార్మికులకు ప్రధానమైన రహదార్లన్నింటిలోనూ విశ్రాంతి కేంద్రాలు ప్రభుత్వం నిర్వహించాలి రాత్రి 11 గం॥ 4 గం॥ మధ్య లారీ రవాణాను నిషేధించి అమలుజరపాలి

4) లారీ కార్మికుల సంక్షేమనిధినేర్పాటు చేసి ఆక్సిడెంట్లలో మరణించిన లేదా శాశ్వత వికలాంగులైనవారికి రూ 10,000ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

5) కార్మిక నష్టపరిహార చట్టాన్ని సవరించి కేసును 6 నెలలలోగా పరిష్కరించి అవార్డును అమలు జరిపేందుకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకోవాలి. ఆక్సిడెంటు అయిన ప్రాంతంలో మారుగా కార్మికుడుంటున్న ప్రాంతపు కార్మిక శాఖ అధికారి వద్ద కేసు దాఖలు చేసేందుకు అవకాశం వుండాలి.

6) బోనస్, ప్రావిడెంట్ ఫండ్ చట్టాలు కార్మికులకు వర్తించే విధంగా సవరించాలి, కనీస బోనస్‌ను గ్యారంటీ ఇవ్వాలి

7) ప్రతి రెన్యూవల్‌కు ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఇవ్వాలనే నిబంధన తొలగించాలి

8) లారీ కార్మికుల చట్టాలన్నింటి అమలును పర్యవేక్షించేందుకు వారి సంక్షేమాన్ని పరిశీలించేందుకు జిల్లా స్థాయిలో కమిటీ నేర్పరచాలి కార్మికశాఖ,రవాణాశాఖ ప్రతినిధులు యజమానుల ప్రతినిధు తోపాటు ఎన్నుకోబడిన కార్మికులు ఈకమిటీలోవుండాలి అవసరమైతే చట్టాన్ని ఉల్లంఘించే యజమానుల లారీలను ఆపే అధికారంతో సహా అన్ని అధికారాలు కూడా ఈ కమిటీకి వుండాలి

—యం. ఎ. గఫూర్

భూతల స్వర్గం అమెరికా గురించి కొన్ని నిజాలు

పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచానికి భూతల స్వర్గంగా చూపిస్తున్న అమెరికా గురించిన కొన్ని చేదు నిజాలివి :

1981వ సంవత్సరానికి దాదాపు 9 5 మిలియన్ల మంది నిరుద్యోగులున్నారు. అంటే జనాభాలో దాదాపు 8 9 శాతం అన్నమాట. నిరుద్యోగుల శాతం తెల్లవారిలో 7 8 శాతం నల్లవారిలో 17.4 శాతం ఉంది. అదేవిధంగా తెల్లజాతి యువకులలో 17.4 శాతం, నల్ల, మరియు హెస్‌పానిక్ యువకులలో 42 9 శాతం ఉంది.

బీదరికపు అంచులలో తెల్లవారు 8.7 శాతం ఉండగా, నల్లవారు 30 6 శాతం, హిస్ పానిక్ జాతులలో 21.6 శాతం ఉన్నారు.

తెల్లవారిలో 37 శాతం, నల్లవారిలో 30 శాతం లాటిన్ అమెరికన్లలో 25. 6 శాతం హైస్కూల్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. యూనివర్సిటీ గ్రాడ్యుయేట్లలో నల్లవారిమీద తెల్లవారు 50 శాతం ఎక్కువగా ఉన్నారు.

ఆరోగ్యపథకాలకు సంబంధించి 1981లో 16 4 బిలియన్ డాలర్లు 1982లో 17 2 బిలియన్ డాలర్లు కోత విధించబడింది ఈ కోతల వల్ల 24 మిలియన్ల మందికి నష్టం కలుగుతుంది దీనిలో 7 మిలియన్ల మంది పిల్లలు. 1977 లో చనిపోయిన తెల్లవారి పిల్లల శాతం 12. 39 వుండగా, నల్లవారి పిల్లల శాతం 21. 9 దాకా ఉంది.

20 ఏండ్ల లోపు వయసువారు 27 మిలియన్లుండగా, దీంట్లో మూడవ భాగం మంది అస్థిరత, అసంతృప్తి, మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు మరియు సంఘం మీద కక్ష, తిరుగుబాటుతనం, పెద్దపెద్ద వ్యక్తిగత వివాదాలు, బంధువులతో తీవ్ర విభేదాలతో బ్రతుకుతున్నారు ఈ బాధలతో, వివాదాలతో ప్రతి సంవత్సరం ఒక మిలియన్ యువకులు తమ యిండ్లను వదిలివేసి బయటకు వెళ్ళిపోతున్నారు ఇటువంటి బాధలతో ఆత్మహత్య చేసుకొంటున్నవారి సంఖ్య కూడ ప్రతి సంవత్సరం పెరుగుతూంది.

7-9 గ్రేడ్లలో చదువుతున్న పిల్లలలో 11శాతం మంది, 10-12 గ్రేడ్లలో చదువుతున్న పిల్లలలో 15 శాతం మంది మత్తుపానీయాలు సేవించటానికి అలవాటుపడ్డారు. సీనియర్ హైస్కూల్ విద్యార్థులలో 72 శాతం మంది మత్తుపానీయాలకు, 34శాతం మారిజునా, 5 శాతం కోకయిన్‌ను సేవిస్తారు.

శాంతిభద్రతల గురించి చెప్పాల్సివస్తే ప్రతి 2 సెకండ్లకు ఒక నేరం జరుగుతుంది. ప్రతి 4 సెకండ్లకు ఒక చోరీ, ప్రతి 8సెకండ్లకు దాడితో కూడిన దొంగతనం, ప్రతి 2 సెకండ్లకు కారు దొంగతనం, ప్రతి 48సెకండ్లకు ఒక దోపిడీ ప్రతి 58 సెకండ్లకు ఒక దారి దోపిడీ ప్రతి 6 నిమిషాలకు ఒక మానభంగం, ప్రతి 23 నిముషాలకు ఒక ఖూనీ జరుగుతున్నాయి.

1980 లో ప్రకటించబడిన మానభంగాలు 82. 000 అదేవిధంగా 5 లక్షల దొంగతనాలు 6½ లక్షల దారిదోపిడీలు, 23, 000 ఖూనీలు జరిగాయి.

Extracted from Fidel Castro's speech at W. F. T. U. Congress Published in T.U. Reena.

హైద్రాబాద్‌లో జూన్ 4న 15 వేల మంది వ్యవసాయ కార్మికుల మహత్తర ప్రదర్శన

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (విజయవాడ) ప్రభుత్వానికి అందజేసిన మెమొరాండం

గ్రామీణ ప్రాంతాలలోని హరిజన, గిరిజన తదితర వ్యవసాయ కార్మికుల జీవన పరిస్థితులు నానాట పరమ నికృష్టమౌతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ ముప్పయి ఐదేళ్ళు అధికారంలో వున్న ప్రభుత్వమే ఇందుకు బాధ్యత వహించాల్సి వుంది. ఈవ్యవసాయ కార్మికులంతా దారిద్ర్య రేఖకు దిగువన వున్నవారే. ప్రభుత్వ విధానాలవల్ల, గుత్త పెట్టుబడిదార్ల దోపిడీ వల్ల దివాలా తీస్తున్న రైతాంగం, చేతి వృత్తుల వారు వ్యవసాయకార్మికుల్లో చేరిపోతుండటం వల్ల ఏటేటా వీరి సంఖ్య పెరుగుతోంది. పనిరోజులు తగ్గిపోతున్నాయి. ఏడాదికి నూటయాభై రోజుల కంటే మించి పని దొరకడం లేదు. వలసలు వెళ్ళడం సర్వసాధారణమైంది. నిత్యజీవితావసర వస్తువుల ధరలు రోజు రోజుకూ విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ విధంగా పెరిగే ధరలకు అనుగుణంగా వారి కూలిరేట్లు ఉండటం లేదు. దీనికితోడు వారి నిజవేతనాలు పడిపోతున్నాయి. రోజుకు రూపాయిన్నర, రెండు రూపాయలు మాత్రమే కూలిరేటు వున్న ప్రాంతాలు కూడా వున్నాయి. ఇందువల్ల కనీసం పని దొరికిన రోజుల్లోనైనా రెండు పూటలా కడుపునిండా తిండి తినే అవకాశం కూడా వారికి లేకుండా పోతున్నది కనుక ఆకలీ, అర్ధాకలీ వారిని వెన్నాడుతూనేవుంది.

సంవత్సరం పొడవునా పనిచేసే పాలేర్ల పరిస్థితి కూడా ఏమాత్రం మెరుగ్గాలేదు. తెల్లవారుఝామున పనిలోకి వెళితే మళ్ళీ రాత్రి ఎంతో పొద్దుపోయిన తరువాతగాని ఇంటికి చేరుకోరు. అయినా వారికి ఇస్తున్న వేతనాలు అంతంతమాత్రంగానే వున్నాయి. వారికి ఎటువంటి శెలవు సౌకర్యం లేదు. దినకూలీలు చౌకగా లభిస్తున్నందువల్ల పాలేర్లు కూడా నిరుద్యోగానికి గురికావలసి వస్తున్నది. ఇటువంటి దుర్భర పరిస్థితులలోవున్న వ్యవసాయ కార్మికుల జీవితాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తగిన చర్యలను తీసుకోవడం లేదు. వారి కనీస వేతనాలనైనా ధరల కనుగుణ్యంగా ఎప్పటి కప్పుడు సవరించి కట్టుదిట్టంగా ప్రభుత్వం అమలు జరపడం లేదు. కనీస వేతనాల సలహాసంఘం సిఫార్సులను, మా సంఘం తెలిపిన సూచనలను ప్రభుత్వం త్రోసిపుచ్చింది. వ్యవసాయ కార్మికుల కనీస వేతనాలను ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయించి ప్రకటించింది. ఈ వేతనాలు నేటి ధరలకనుగుణ్యంగా ఏ మాత్రం లేవు. మంచి వాతావరణం, పని ఒత్తిడి వున్న ప్రాంతాలలో వ్యవసాయ కార్మికులు ఐక్యంగాను వుండి సాధించుకుంటున్న రేట్ల కంటే కూడా అవి అధ్వాన్నంగా వున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన రేట్లనైనా అమలు జరిపేందుకు చట్టబద్ధమైన యంత్రాంగంలేదు.

గ్రామీణ ప్రాంతాలలోపేదరికాన్ని, నిరుద్యోగాన్ని నిర్మూలించడానికి హరిజన, గిరిజన తదితర వ్యవసాయ కార్మికుల జీవన, సాంఘిక పరిస్థితులను మెరుగుపర్చడానికి భూస్వామ్య పద్ధానాన్ని రద్దుచేసి దున్నేవానికి భూమి ఇవ్వడం అవసరమని జాతీయోద్యమ కాలం నుండి అందరం అంగీకరించిన విషయం. స్వాతంత్ర్యం వచ్చి మూడున్నర దశాబ్దాలైంది అయినా భూసమస్య నేటికీ పరిష్కరించబడలేదు మన రాష్ట్రంలో తెచ్చిన భూసీలింగ్ చట్టం కోర్టు తీర్పులవల్ల భూస్వాములు తప్పించు కోడానికి లొసుగులు కల్పించడం వల్ల నిష్ప్రయోజనమైంది. దీని పర్యవసానంగా మిగులు భూమిగా తేలుతుందని ప్రభుత్వం మొదట్లో ప్రకటించిన 20 లక్షల ఎకరాలు 1978 నాటికి 16 లక్షలకు దిగజారిపోయింది. అది 1980 నాటికి 11 లక్షలకు మరీ దిగజారింది. అందులో ఆరులక్షల ఎకరాలు కోర్టు పేచీల్లో వున్నాయి. మిగతా ఐదు లక్షల్లో మూడు లక్షల డెబ్బయిఐదువేల ఎకరాలను మాత్రమే ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. అందులో 95 వేల ఎకరాలు 4-ఎ సవరణవల్ల కోర్టు తీర్పుల వల్ల భూస్వాములకు తిరిగి దత్తం చేయవలసి వస్తున్నదనికూడా ప్రభుత్వం చెబుతున్నది స్వాధీనం చేసుకున్న దాంట్లో కూడా రెండున్నర లక్షల ఎకరాలను పంపకం చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది పంపిణీ చేయబడిన భూమిలో కూడా కొంత పై కారణాల వల్ల భూస్వాములకు తిరిగి ఇచ్చివేయాల్సి వస్తున్నదని ప్రభుత్వం ఇంతకు ముందు చెప్పింది ప్రభుత్వం పంచిన దాంట్లో కూడా మాగాణి భూమి 18 వేల ఎకరాలు మాత్రమే. మిగతాదంతా వ్యవసాయానికి యోగ్యం కాని రాళ్ళు, రప్పలూ ననేవి గమనింపదగ్గ విషయం.

ఈ విషయాలన్నింటినీ గతంలో ప్రభుత్వం దృష్టికి తెచ్చాం లోపభూయిష్ఠంగా వున్న ప్రస్తుత సీలింగు చట్టాన్ని పేదలకు భూమి లభించే విధంగా సవరి చాలని కోరాం ఈలోపుగా చట్టాన్ని ఉల్లంఘించి దొంగ లెక్కల ద్వారా దాచిన, అన్యాక్రాంతంచేసిన అక్రమంగా అమ్మిన మిగులు భూములన్నింటినీ స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని ప్రభుత్వాన్ని కోరాం ఇది ఏమాత్రం జాప్యం జరిగినా ఆ మిగులు భూములు కూడా చేజారిపోతాయని కూడా ప్రభుత్వ దృష్టికి తెచ్చాం

కాని మా సూచనలను ప్రభుత్వం పెడచెవిని బెట్టింది అందువల్ల భూసమస్య తీవ్రతను, దొంగ లెక్కలతో భూస్వాములు తొక్కిపెట్టిన మిగులుభూములను బహిర్గతం చేసేందుకు 1979 ఫిబ్రవరి 27 నుండి మార్చి 7 వరకు రాష్ట్రవ్యాపితంగా ఐక్య ఉద్యమం సాగించాల్సి వచ్చింది. మూడువందల కేంద్రాలలో 70 వేల మంది సంఘటితమై దాదాపు 20 వేల ఎకరాల మిగులు భుమిని 700 ఎకరాల భూస్వాముల ఆక్రమణలోగల ప్రభుత్వ బంజర్లను పేదలు బైటికి లాగి చూపించారు. ఈ ఉద్యమం సందర్భంగా నెల్లూరు జిలాలో అనేక గ్రామాల్లో ప్రభుత్వం నిషేదాజ్ఞలు జారీచేసింది పోలీసులు కాల్పులు జరిపారు గాలెంకి తిరుపాలు అనే హరిజన యువకుడు మరణించాడు. హరిజనులైన రవణమ్మ,నర్సయ్యలనబడే మరిఇద్దరిచేతులు తీసివేయాల్సి వచ్చింది. భూస్వాములు దొంగ లెక్కలిచ్చిన డిక్లరేషన మీద పునర్విచారణ జరిపిసామని, చట్టానికి ఇతర సవరణలను తీసుకొసామని, బంజర పంపకాన్ని త్వరగా పూరిచేస్తామని ఆ ఉద్యమ సందర్భంగా ప్రభుత్వం శాసనసభలో ప్రకటించింది ఆ వాగ్దానాన్ని ప్రభుత్వం ఇప్పటికీ నెరవేర్చలేదు. ఆ ఉద్యమం సందర్భంగా మూడువేల

ఏడువందల మందిపై బనాయించిన కేసులను ఉపసంహరించాలని ఉభయ వ్యవసాయ కార్మికసంఘాల ప్రతినిధివర్గాలు ఇంతకు ముందు ముఖ్య మంత్రులను కోరాయి. అందుకు వారు అంగీకరించారు. ఇంతకాల మైనా అందుకు వారు ఎట్టిచర్యలు తీసుకు న్నది నేటికీ తెలియనేలేదు.

కృష్ణాజిల్లాలో చల్లపల్లి మాజీ జమిందారు మూడువేల ఎకరాల సారవంతమైన మిగులు భూములను చల్లపల్లి పంచదార ఫ్యాక్టరీ పేరిట పెట్టి, ఫ్యాక్టరీ ప్రధాన కార్యాలయం మద్రాసులో వున్నదనే నెపంతో ఆంధ్ర ప్రదేశ్ భూసీలింగ్ చట్టం తనకు వర్తించ దని మద్రాసు హైకోర్టులో దావావేసి స్టే తెచ్చుకొని అనుభవిస్తూ వచ్చాడు ఆ స్టేని కొట్టివేస్తూ ఆంధ్రప్రదేశ్ భూసీలింగ్ చట్టం తనకి వర్తిస్తుందని మద్రాసు హైకోర్టు తీర్పునిచ్చింది. ఆ వెన్వెంటనే చల్లపల్లి జమీందారు మిగులుభూములు స్వాధీనం చేసు కొని పేదలకు పంచేందుకు ప్రభుత్వంచర్యలు తీసుకోవలసిందిపోయి తాత్సారం చేస్తోంది తెల్లకాగితాల మీద చేసుకున్న భూమార్పి డులు చెల్లవని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు నిచ్చింది. ఆ తీర్పు తర్వాతనైనా ప్రభుత్వం ముందుకు వచ్చి అట్టి మిగులు భూములను స్వాధీనం చేసుకోలేదు ఎక్కడైనా హరిజన, గిరిజన తదితర వ్యవసాయకార్మికులు భూమి కోసమో, ఇళ్ల స్థలాల కోసమో, కూలిరేట్ల పెంపుకోసమో ముందుకొచ్చి నిలబడితే వారి మీద పోలీసు నిర్బంధం సాగుతోంది భూస్వాములు కిరాతకమైన దాడులు సాగిస్తు న్నారు తమ నికృష్ట పరిస్థితులను హరిజన, గిరిజన తదితర వ్యవసాయ కార్మికులు ఎల్ల కాలం భరించలేరు. వారు తమ న్యాయమైన కోర్కెల కోసం సంఘటితమై ఉద్యమించడం తప్పనిసరి అవుతోందని ప్రభుత్వ దృష్టికి తెస్తున్నాం. మీరు పై విషయాలన్నింటినీ పరి గణనలోకి తీసుకొని తక్షణం ఈ క్రింది చర్యలు గైకొనవలసిందిగా ఈ రోజు హైద్రాబాద్‌కు వచ్చి ప్రదర్శన జరిపిన వేలాదిమంది వ్యవసాయ కార్మికుల తర పున కోరుతున్నాం.

1. వ్యవసాయ కార్మికులకు రోజుకు కనీస కూలి ఎనిమిది కిలోల ధాన్యం లేదా దానికి సమానమైన నగదుకు తక్కువ కాకుండా నిర్ణయించాలి. పాలేర్లకు మూడు జోన్లలో వరుసగా 22 5, 19, 15 క్వింటాళ్ళ ధాన్యం ఏడాదికి కనీస వేతనంగా నిర్ణయించాలి. సంవత్సరానికి 15 రోజులు తక్కువగాకుండా సెలవు సౌకర్యం కల్పించాలి. పనిలో వుండగా ప్రమాదానికి గురై చనిపోయిన కుటుంబాలకు నష్టపరిహారాన్ని యజమాని శక్తిగలవారైతే యజమానుల నుండి లేదా ప్రభుత్వం చెల్లించాలి.

ఈ కనీస వేతనాలు అమలుపర్చేందుకు చట్టబద్ధ యంత్రాంగాన్ని నియమించాలి.

పనులులేని కష్టకాలంలో పని కల్పించాలి లేదా తిండైనా పెట్టాలి. ఇందుకు జాతీయ గ్రామీణాభివృద్ధి పథకాన్ని సక్రమంగా అమలు జరిపి రోజులు రెండుకిలోలబియ్యం, ఒక రూపాయి ఇవ్వాలి. పని చూపలేకపోతే కుటుంబానికి కిలో బియ్యం, ఒక రూపాయి వంతున కరువు భృతి ఇవ్వాలి.

2) (1) నిరర్థకమైన ఆచరణలో రుజువైన ప్రస్తుత భూసీలింగు చట్టం అమలును సమీక్షించి పేదలకు భూములు లభించేవిధంగా సవరణలు తెచ్చి అమలు జరపాలి. బినామీ మార్పిడుల ద్వారా, దొంగలెక్కల ద్వారా దాచుకున్న మిగులు భూముల సమస్యపై పునర్విచారణ జరిపించాలి ఇందుకు ప్రజా సంఘాల, ప్రజాప్రతినిధుల సహకారం తీసు కోవాలి. భూసీలింగు చట్టాన్ని రాజ్యాంగం 9వ షెడ్యూలులో చేర్చాలి

2) చల్లపల్లి మాజీ జమీందారు దావాను మద్రాసు హైకోర్టు కొట్టివేసినందున వారు అనుభవిస్తున్న మూడువేల ఎకరాల మిగులు భూములను ప్రభుత్వం తక్షణం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలి తెల్లకాగితాల మీద చేసుకున్న భూమిమార్పిడులు చెల్లవని సుప్రీంకోర్టు యిచ్చిన తీర్పు దృష్ట్యా ఆ పరిధి క్రిందకు వచ్చే మిగులు భూములన్నింటినీ ప్రభుత్వం స్వాధీనంచేసుకొని పేదలకు పంచేందుకు సత్వర చర్యలు తీసుకోవాలి

3) ఐక్య భూపోరాటం సందర్భంగా వ్యవసాయ కార్మికులపై పెట్టిన కేసులన్నింటినీ ఎత్తివేయాలి

4) భూస్వాముల చేతుల్లోని ప్రభుత్వ బంజరను, చెరువు పడకలను, ఇతర బంజర్లను వ్యవసాయ కార్మికులకు సత్వరం పంపకం చేయాలి. ఈ భూములను పేదలు సాగుచేయుటకు ఎదురవుతున్న ఆటంకాలను తొలగించాలి. బంజరు సాగుదార్లపై పెనాల్టీలను, శిస్తులను రద్దు చేయాలి.

3) ఇళ్ళ స్థలాల సమస్యను త్వరితంగా పరిష్కరించేందుకు పూనుకోవాలి గజిట్ ప్రకటన జరిగిన వాటి విషయంలోనూ, పేదలకు అత్యవసరమైన స్థలాల విషయంలోనూ అడ్వాన్సు పొజిషన్ తీసుకోవాలి. మెరక జేసుకునేందుకు ఆర్థిక స్తోమతు లేక ఇవ్వబడిన స్థలాలు కూడా ఏళ్ళ తరబడి పడావుగా వుంటున్నాయి. కనుక ఇచ్చిన స్థలాలకు మెరక చేసుకునేందుకు గ్రాంటు యివ్వాలి. ఇళ్ళు వేసుకునేందుకు ప్రభుత్వం ప్రకటించిన వెయ్యిరూపాయలు అందరికీ సక్రమంగా అందేట్లు నిధులను బడ్జెట్లో కేటాయించాలి.

4) అరవై ఏళ్ళకు పైబడిన వ్యవసాయ కార్మిక వృద్ధులకు నెలకు అరవై రూపాయల వంతున వృద్ధాప్య పింఛను ఇవ్వాలి. అరవై ఐదేళ్ళకు పైబడిన, దిక్కులేనివారికి మాత్రమే ముప్పై రూపాయలవంతున ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది ఈ నిబంధనను మార్చి వ్యవసాయకార్మిక వృద్ధులందరికీ పింఛను ఇవ్వడమనేది సామాజిక బాధ్యతగా ప్రభుత్వం గుర్తించి అరవై ఏళ్ళకు పైబడిన వారందరికి పింఛను ఇవ్వాలి. అందుకు కేటాయింపులను హెచ్చించాలి.

5) వ్యవసాయకార్మికులకు కనీసవేతనం, పని భద్రత, మెరుగైన పని పరిస్థితులు కల్పించేందుకై ప్రభుత్వం చట్టం చేయాలి

ఇట్లు,

లావు బాలగంగాధరరావు
అధ్యక్షులు

టి. వి. ఆర్. చంద్రం
ప్రధాన కార్యదర్శి

కామ్రేడ్ డిమిట్రోవ్
శత జయంతి

(1వ పేజీ తరువాయి)

కమిటి జనరల్ సెక్రటరీగా కామ్రేడ్ డిమిట్రోవ్ ఎన్నుకోబడ్డారు. 1943లో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రద్దు అయ్యేవరకు ఆ కామ్రేడ్ ఆ బాధ్యతలో వున్నారు.

నేడు ప్రపంచంలో అమెరికన్‌సామ్రాజ్యవాదులు ప్రమాదకర ఆయుధాలతో కూడి సాగించే మరో యుద్ధప్రయత్నాలకు మారణహోమానికి వ్యతిరేకంగా ప్రపంచ కార్మికులను, ప్రజాతంత్ర శక్తులను సమీకరించాల్సిన అతిముఖ్య కర్తవ్యం ముందుకొచ్చింది ఈ సందర్భంగా అంతర్జాతీయ కమ్యూనిస్టు, కార్మిక ఉద్యమ నాయకుడు కామ్రేడ్ డిమిట్రోవ్ నిర్వహించిన విధానం ఎత్తుగడలు మనకెంతో ఉపకరిస్తాయి. కామ్రేడ్ డిమిట్రోవ్ 1949 జులై 2న అస్తమించారు ఆ కామ్రేడ్‌కివే మన విప్లవజోహార్లు

లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు - వారిస్థితి గతులు

నేటి ఆర్థిక వ్యవస్థలో మార్కెట్‌ను క్రమబద్ధం చేయడంలో రవాణా పరిశ్రమ ప్రత్యేక పాత్ర నిర్వహిస్తున్నదన్నది నిర్వివాద అంశం సరకుల రవాణాలో రైల్వేల కంటే కూడా రోడ్డు రవాణా కీలక పాత్రను నిర్వహిస్తున్నది. ఈ ప్రాధాన్యత వల్లనే దేశవ్యాపితంగా రోడ్డు రవాణా ఒక పరిశ్రమగా వేగంగా అభివృద్ధి చెందుతున్నది. తక్కువ పెట్టుబడి ద్వారా ఎక్కువ లాభాలు సంపాదించే పరిశ్రమగా ఇది గుర్తింపు పొందింది బంగారు గ్రుడ్లు పెట్టె బాతుగా లారీలు యజమానులకుపయోగపడుతున్నాయి. ఒక్క లారీవున్న యజమాని అనతి కాలం లోనే అనేక లారీలతో ఫ్లీట్ ఓనర్‌గా అభివృద్ధిచెందిన ఉదాహరణలున్నాయి యజమానుల తర్వాత ఈ పరిశ్రమ నుంచి బాగుపడుతున్నది ప్రభుత్వమే వివిధ పన్నుల రూపాల్లో ప్రతి సం॥ కొన్ని వందల కోట్ల రూపాయిలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు లారీ పరిశ్రమ నుంచి కొల్లగొడుతున్నాయి. లాభాలకు మూల కారకులై రేయింబవళ్ళు కృషిచేసున్న కార్మికులు మాత్రం ఈ పరిశ్రమలో గొప్ప నిరాదరణకులోనై దారుణ దోపిడికి గురిచేయబడుచున్నారు.

మన రాష్ట్రంలోనే లక్షమంది కార్మికులు (డ్రైవర్‌లు, క్లీనర్‌లు) లారీలలో పని చేస్తున్నారు. పరోక్షంగా (లారీ బ్రోకర్స్, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల సిబ్బంది ముఠా కార్మికులు తదితరులు) మరికొన్ని వేల మంది ఈ పరిశ్రమపై ఆధారపడుచున్నారు. రాష్ట్రంలో ఇంతపెద్ద సంఖ్యలో కార్మికులు గల పరిశ్రమ కూడా బహూశా ఇదేనేమో! లారీ రవాణా ఎంత అభివృద్ధిచెందుచున్ననూ, లాభాలరేటు ఎంత పెరుగుచున్ననూ లారీల్లో పనిచేసే కార్మికుల బ్రతుకు మాత్రం రోజు రోజుకు మరింత అధ్వాన్న స్థితికి చేరుతున్నది. అనేక సమస్యలతో "దినగండం-నూరేళ్ళ ఆయుస్సు" గా కార్మికుడు బ్రతకవలసి వస్తున్నది. కార్మికుల సంక్షేమానికై కాంగ్రెస్ పాలకులు చేసిన చట్టాలే నామ మాత్రమయినవి కాగా, అవి కూడా లారీ కార్మికుల పాలిట "నీటి మూటలు" గానే మిగిలిపోయాయి. చట్టబద్ధమైన ఏహక్కులూ అమలులో లేక, ఉద్యోగాలకూ మరియు జీవితాలకూ ఏ రక్షణా లేక కేవలం వెట్టిచాకిరి చేసే కార్మికులుగానే లారీ కార్మికులు మిగిలి పోయారు.

1) రాష్ట్రవ్యాపితంగా లారీ కార్మికలకు ఒకే రకమైన వేతన వ్యవస్థ లేదు వివిధ ప్రాంతాలలో వివిధ రకాలైన వేతనాలు అమలులో వున్నాయి. డ్రయివర్‌కు నెలకు 2 వందలు రెండలులుకొని 4 వందలదాకానూ క్లీనర్‌కు నెలకు వంద మొదలుకొని రెండు వందల యాభై దాకానూ వేతనాలువున్నాయి రాష్ట్రంలో ప్రైవేటు యజమానుల వద్ద పని చేసున్న ఎంతో సర్వీసుగల డ్రయివర్ వేతనం కూడా 4 వందలకు దాటని స్థితి వున్నది. ఈ వేతనాలు ప్రస్తుతం గల ధరలతో పోల్చితే ఎంత అధ్వాన్నమయినవో ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. ఇతర ఆర్గనైజ్డ్ పరిశ్రమలోగల డ్రయివర్ వేతనంలో లారీ డ్రయివర్ వేతనం 1/3 వంతు లేదా సగానికిమించదు ఇక క్లీనర్ వేతనం గ్రామీణ వ్యవసాయ కార్మికుడి వేతనం కంటే తక్కువే.

ఇప్పటికీ వున్న లారీ కార్మికసంఘాల ఒత్తిడివల్లనూ, కనీసవేతనాల సలహా మండలిలో గల కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధుల కృషి వల్లనూ మోటారు కార్మికుల కనీస వేతనాల్ని పెంచుతూ 1981 వ సం॥లో జూన్ మాసంలో ప్రభుత్వం ఒక జి. వో. చేసింది. డ్రైవర్‌కు కనీస వేతనం 482-00 గానూ, క్లీనర్‌కు 250-00గానూ, నిర్ణయించింది మొక్కుబడిగా వేతనాలు పెంచుతూ ఈనిర్ణయం చాలా అశాస్త్రీయమైన పద్ధతిలో జరిగింది. నిర్ణయించడమే, తప్పితే వాటిని అమలు జరిపాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఏకోశానా లేదు. ఈ జి.వో. ప్రకారమైనా వేతనాలు అమలు జరిపించుకోడానికి తగిన వ్యవస్థీకృత బలం రాష్ట్ర వ్యాపితంగా లేనందువల్ల లారీ కార్మికులకు ఈజి.వో. 'ఎండమావి'గానేమిగిలిపోతున్నది. కనీస వేతనాల అమలు కొరకై అక్కడక్కడ ఆందోళనకు దిగిన కార్మికులు యజమానులచే నిర్దాక్షిణ్యంగా అణచివేయబడ్డారు. వందలాదిగా, సామూహికంగా ఉద్యోగాల్లోంచి తొలగించివేయబడ్డారు. కార్మికశాఖ ఈ విషయంలో ప్రేక్షక పాత్ర నిర్వహించింది తప్పితే, చట్టాల్ని అమలుజరిపేందుకు కనీసశ్రద్ధ కూడా తీసుకోలేదు.

2) వేతనంతో పాటుగా ఈ పరిశ్రమలో "బత్తా" కూడా నామకః ఇస్తున్నారు. సుదూర ప్రాంతాలు, నగరాలు చుట్టివచ్చే కార్మికులకు రోజువారీ ఖర్చులకు యజమానులు ఇచ్చే బత్తా ఏమాత్రం చాలడంలేదు. ఖచ్చితంగా పనిచేసే కార్మికుడికి ప్రతిడ్యూటీకి బత్తా కంటే కూడా అదనంగా ఖర్చుఅగుట వల్ల జీతంలో 'కట్' చేయించుకోవలసివస్తున్నది అసలే తక్కువగా నుండే జీతంలో ఈ మినహాయింపులు పోతే మిగిలేది జేబు ఖర్చులకొస్తుందితప్ప భార్యా పిల్లల పోషణకేమాత్రం మిగలదు ఈ ఇస్తున్న బత్తాకు ఏ రకమైన శాస్త్రీయపద్ధతిలేదు కొన్నిచోట్ల దిన బత్తాగానూ, మరికొన్నిచోట్ల కలెక్షన్ బత్తాగానూ ఇస్తున్నారు. హోటల్ రేట్లు ఎంత పెరిగిననూ బత్తా రేట్లలో మాత్రం పెరుగుదల శూన్యం.

3) లారీ కార్మికులకు ఉద్యోగ భద్రత లేదు యజమానుల దయాదాక్షిణ్యాలపైనే కార్మికుడి ఉద్యోగం ఆధార పడి వుంటుంది యజమానికే కాదు, యజమాని కుటుంబంలోని ఎవరికోపానికి గురైనా కార్మికుడి ఉద్యోగం వెంటనే ఊడుతుంది ఎన్ని సంవత్సరముల సర్వీసు వున్నా ఉద్యోగం ఊడితే ఒట్టి చేతులతో ఇంటికి పోవలసిందే సర్వీసుకు పరిహారంగా చట్టబద్ధంగా ఇవ్వవలసిన వేవీ ఈ కార్మికుల కమలులో లేవు ఉద్యోగంలోచేర్చుకున్న వెంటనే అప్పాయిమెంట్ ఆర్డర్స్ ఇవ్వాలని మోటారు కార్మిక చట్టంలోని నిబంధన చదవడానికి ఆనందంగా నున్నా అమలులో మాత్రం లేదు.

4) 8 గం॥ల పని విధానం లారీ కార్మికులకు పగటికల లాంటిదే. లారీ కార్మికులు సగటున రోజుకు 12 గం॥నుండి 16 గం॥ల దాకా పనిచేయవలసి వుంటుంది. నిర్ణీత పని గంటలుగానీ, అదనపుపనికి తగు పరిహారం గానీ ఈ పరిశ్రమలో అమల్లో లేవు.

5) లారీ కార్మికుడి ఉద్యోగానికే కాదు అతని ప్రాణానికి కూడా రక్షణ లేదు. యజమానులు వెహికల్ కండిషన్ సక్రమంగా వుంచకపోవడం వల్లనూ, రోడ్లు అధ్వాన్న స్థితిలో వుండటంవల్లనూ, విరామం లేకుండా దీర్ఘకాలం పాటు కార్మికుడు పనిచేయవలసి రావడం వల్లనూ ఆక్సిడెంట్లు పెద్ద సంఖ్యలో జరుగుచున్నాయి. ఈఆక్సిడెంట్లకు గురై పెద్ద సంఖ్యలోనే లారీ కార్మికులు చనిపోవడమో,

KLV01A155

శాశ్వతవికలాంగులుకావడమోజరుగుతున్నది. కొన్ని సందర్భాలలో తమ కుటుంబ సభ్యుల "కడసారిచూపు"కు కూడా అవకాశం లేనట్టి సుదూరప్రాంతాల్లోనూ, శవాన్ని తేవడానికి కూడా వీలులేని ఘోరమైన స్థితిలోనూ కార్మికులు చనిపోతున్నారు. చనిపోయిన లేదా వికలాంగులైన కార్మికుల కుటుంబాలకు యజమానులు ఏరక్షణ కల్పించడంలేదు. ఈలాటి చాలా కుటుంబాలు దారుణమైన పేదరికంలో మగ్గుతూజీవిస్తున్నాయి. కార్మిక నష్టపరిహార చట్టం చాలామందికి తెలియదు. పరిహారం చెల్లించిన యజమానులు కూడా చట్టప్రకారం కాకుండా తమ దయకు తోచింది మాత్రమే ఇస్తున్నారు. ఈ విషయాలపై ప్రభుత్వం పర్యవేక్షణ ఏదీలేదు. అథవా ఎవరైనా కార్మికులో లేక వారి కుటుంబాలో నష్టపరిహార చట్టం ద్వారా కేసులు పెట్టినమా అధికారుల ఆఫీసుల చుట్టూ ప్రదక్షణలు చేయవలసిందే తప్ప కేసులు త్వరితంగా పరిష్కరింప బడుటలేదు. చనిపోయిన ప్రాంతాల అధికారుల వద్దనే కేసుపెట్టాలన్న నిబంధన వల్ల సుదూరప్రాంతాల్లో కొన్నిసందర్భాలలో ఇతరరాష్ట్రాలలో కేసులుపెట్టవలసిన పరిస్థితి ఎంతమంది కార్మికులు ఈ దూరప్రాంతాల్లోని ఆఫీసులకు పోయి కేసులుపెట్టి భరించుకోగలరో మనం ఊహించుకోవచ్చు పట్టు వదలక ఒకవేళ పోరాడి కేసులో అవార్డు ఇప్పించుకున్ననూ దాన్ని అమలుజరిపించుకునే గ్యారంటీలేదు అపాటికే ఆలారీ అమ్మివేయటమో, లేకుంటే తనకే స్థిరాస్థి లేదని యజమాని చేతులెత్తడమో జరిగితే ఇంత శ్రమా వృధానే

6) లారీ కార్మికులు ఏ నేరం చేయకపోయిననూ అనేక కేసుల్లో ఇరుక్కొనవలసి వస్తున్నది ఏ ఆక్సిడెంటు జరిగిననూ, ఆ ఆక్సిడెంటు కారణాలేమైనప్పటికిన్నీ ముద్దాయి మాత్రం లారీ డ్రయివరే అంతేగాక తనకు సంబంధం లేకున్ననూ విజిలెన్సు వారి కేసులకూ, ఫారెస్టువారి కేసులకూ బలిపశువు లారీ డ్రయివరే. కేసులలో ఇరుక్కున్న కార్మికులను చాలామంది యజమానులు ఆదుకోవడంలేదు స్వంత జేబు నుంచి కేసులకై ఖర్చుపెట్టుకోవలసి వస్తున్నది తప్పుడు కేసులకు గురై తను జైలుకు పోకుండా వుండేందుకై ఆ విధంగా తను స్వంతంగా ఖర్చుపెట్టుకొని అప్పులపాలు కావడమో లేకుంటే చెయ్యని నేరానికి జైలుకు పోవడమో కార్మికుడి కర్తవ్యంగా మిగిలిపోతున్నది.

7) లారీ కార్మికులపై పోలీసుల దౌర్జన్యాలు రోజూ చూస్తున్నవే. ఏ నేరం చేయకపోయినా ఇష్టమొచ్చినట్లు కొట్టడం, కేసులు బనాయించడం, లైసెన్సులు లాక్కోవడం పోలీసులకు సాధారణమైనదే. పోలీసు మామూళ్లు ఇస్తే యజమాని ఒప్పుకోడు, ఇవ్వకపోతే పోలీసులు కొడతారు "ముందు నుయ్యి వెనుక గొయ్యి" ఇదీ లారీ కార్మికుడి స్థితి.

8) పోలీసువారి కంటే మేమేమి తక్కువ గాదన్నట్లుగా రవాణాశాఖ వారి దౌర్జన్యాలు కూడా లారీ కార్మికులపై పరిపాటి అయ్యాయి. చీటికి మాటికి డ్రైవర్లపై కేసులు వ్రాయడం, లైసెన్సులు సస్పెండు చేయడం సాధారణమైపోయింది లారీకి సంబంధించిన ఏవైనా లోపాలున్నా వాటికి కూడా డ్రయివర్ పైనే కేసులు పెట్టడం జరుగుచున్నది ఇటీవల క్రొత్త నిబంధలు అమలు చేస్తున్నారు. ఎవరైనా క్రొత్తగా డ్రయివింగ్ లైసెన్సు కావాలనుకుంటే తాను ఏవాహనం నడుపాలనుకుంటాడో ఆ వాహనాన్ని స్వయంగా తెచ్చి ఈ శాఖ అధికారులయెదుట నడిపి చూపించాల్సిందే. ఏవాహనం తెచ్చి "ట్రయిల్" ఇస్తాడో ఆ వాహనం మేరకు మాత్రమే డ్రయివింగ్ లైసెన్సు ఇస్తారు. అలాగే డ్రయివర్ తన లైసెన్సును రెన్యూవల్ చేయించుకునే ప్రతి సందర్భంలోనూ క్రొత్తగా ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్టు జతపరచవలసిందే. అనవసరమైన నిబంధనలతో రవాణా కార్మికుల రక్తాన్ని జలగల్లాగా ఈ డిపార్టుమెంటు పీల్చుతున్నది.

పైన పేర్కొన్నవి రాష్ట్రంలో లారీ కార్మికులు ఎదుర్కొంటున్న కొన్ని ముఖ్యమైన సమస్యలు మాత్రమే. రాష్ట్ర వ్యాపితంగా లారీ కార్మికులకు ఒకే సంఘంలేనందువల్ల లారీ కార్మికులు ఏ హక్కుల్నీ సాధించుకోలేక పోతున్నారు. రాష్ట్ర సంఘాలుగా కొన్ని పేర్లతో తమంతట తామే నాయకులుగా పరిచయం చేసుకుంటున్న వ్యక్తులు తమ తమ స్వార్ధ ప్రయోజనాల కొరకై కార్మికుల్ని ఉపయోగించుకుంటున్నారు. మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ బూటకపు సంఘాల నాయకులుగా ఇంటర్ స్టేట్ పర్మిట్లు తెచ్చుకొనిసుఖపడుతున్నారు. అక్కడక్కడ "సదస్సుల" పేర్లతో విరివిగా చందా వసూలు చేసుకుంటూ తమ పబ్బం గడుపుకుంటున్నారు. వీరి స్వార్ధ ప్రయోజనాలను ఎండగట్టే రాష్ట్ర వ్యాపిత సంఘంగా ఒక బలమైన మిలిటెంటు ఉద్యమాన్ని నిర్మించే కర్తవ్యం ప్రజాతంత్ర ఉద్యమం మీద ఎంతైనా వున్నది. రాష్ట్రంలో ఇప్పటికే చాలా ప్రాంతాల్లో అలాంటి సంఘాలుఏర్పడి పనిచేస్తున్నాయి. అయితే కొన్ని ప్రాంతాలకే పరిమితికావడంవల్ల అవి పరిమితమైనవిజయాలనే సాధించగలుగుచున్నాయి. ప్రజాతంత్ర ఉద్యమం బలహీనంగా నున్న ప్రాంతాల్లో కార్మిక సంఘాల్ని విచ్ఛిన్నం చేసేందుకై లారీయజమానులు సంఘటితంగా "యుద్ధాన్ని" ప్రకటించి తీవ్రమైన కక్ష సాధింపు చర్యలు చేబడుచున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల, వనపర్తి, కర్నూలు జిల్లాలోని బేతుచర్ల, ఎమ్మిగనూరు, ఆదోని తదితర ప్రాంతాల్లో ఈపరిణామాలు గమనించవచ్చు. ప్రభుత్వం లారీపరిశ్రమలో పనిచేస్తున్న

(మిగతా 8వ పేజీలో)

(4వ పేజీ తరువాయి)

అం.ద్ర.ని.తో తెగతెంపులు

గయానాకూడా అంతర్జాతీయద్రవ్యనిధితో తెగతెంపులు చేసుకోవాలి ప్రజాస్వామ్య సామ్రాజ్యవాద వ్యతిరేక సోషలిస్టు పంథానే నిజమైన శాంతికి, సాంఘికోన్నతికి మార్గం.

గయానాకి కావల్సింది విప్లవ ప్రజాస్వామ్య. విదేశీ అప్పులు, పరిహారాలువీలయినంతగా తగ్గించాల్సివుంది. అవినీతి, దుబారాలను పూర్తిగా రూపుమాపాలి. మిలటరీ బ్యూరోక్రసీలపై ఖర్చు తగ్గించాలి.

విదేశీ మారక సంక్షోభానికి సమాధానం కాదు అంతర్జాతీయ ద్రవ్యనిధి.

వీటికి సమాధానం బకాయిల చెల్లింపులు తగ్గించడం, ఉత్పత్తి పెంచడం మొదలైన వాటిలో వుంది. 1978 టి.యు.సి. సదస్సు చెప్పినట్లుగా యిది రాజకీయమైనది.

అంటే కార్మికుల పాత్ర పూర్తిగా కలిగి వున్న విశాలమైన ప్రజాస్వామ్య పునాదిని సోషలిస్టు నిర్మాణాన్ని నిర్మించు కోవడమే

ప్రజాశక్తి ప్రెస్, విజయవాడలో ముద్రింపబడి, సి. ఐ. టి. యు. ఆంధ్రప్రదేశ్ కమిటీ పక్షాన
శ్రీ నండూరి ప్రసాదరావుచే విజయవాడ నుండి ప్రకటింపబడింది. ఎడిటర్ : శ్రీ నండూరి ప్రసాదరావు

మనసు ఫౌండేషన్
పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLV01A155
పుస్తకం పేరు	5086 కులం
తారీఖు	23/08/23
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	13
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	No
లేని పేజీలు	NO
తయారు చేసినది	Mounika
పేజీలు విడదీసినది	Mouni
స్కాన్ చేసినది	Nandhu
పరీక్ష చేసినది	pragathi
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	No
పరిస్థితి	good